



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు






సంపుటి : 1 సంచిక : 74 పేజీలు : 8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : తాడేపల్లిగూడెం ఆదివారం 25 జనవరి 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 74 PAGES : 8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : THADEPALLI GUDEM SUN 25 JANUARY 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur




## అమెరికాలో మంచు తుపాను విలయతాండవం...

### 16 రాష్ట్రాల్లో ఎమర్జెన్సీ, 8,000 విమానాలు రద్దు!

- అమెరికాను ముంచెత్తుతున్న భారీ మంచు తుపాను
- దాదాపు 20 కోట్ల మంది ప్రజలపై తీవ్ర ప్రభావం
- 16కు పైగా రాష్ట్రాల్లో స్టేట్ ఆఫ్ ఎమర్జెన్సీ విధింపు
- వారాంతంలో 8,000కు పైగా విమాన సర్వీసులు రద్దు
- పలు ప్రాంతాల్లో విపత్తు స్థాయి మంచు పేరుకుపోయే ప్రమాదం

పెన్ పవర్ డెస్క్:అమెరికా చరిత్రలోనే అత్యంత తీవ్రమైన మంచు తుపానుల్లో ఒకటి దేశాన్ని అతలాకుతలం చేస్తోంది. టెక్సాస్ నుంచి న్యూ ఇంగ్లాండ్ వరకు సుమారు 2,000 మైళ్ల విస్తీర్ణంలో ఈ తుపాను ప్రభావం చూపుతుండటంతో అగ్రరాజ్యం గజగజ వణికిపోతోంది.

- మిగతా 2లో...



## మావోయిస్టులకు మరో ఎదురుదెబ్బ... ఇద్దరు మావోలు అరెస్ట్

- దండకారణ్య స్పెషల్ జోన్ కమిటీ మెంబర్ సాల్మన్, ఆయన భార్య అరెస్ట్
- అచ్చంపేటకు వచ్చిన మావోయిస్టు దంపతులు
- అరెస్ట్ చేసిన నాగర్ కర్నూలు పోలీసులు

పెన్ పవర్ డెస్క్:ఇప్పటికే వరుస ఎన్ కౌంటర్లు, లొంగుబాట్లతో భారీగా దెబ్బతిన్న మావోయిస్టు పార్టీకి మరో ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీ దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ మెంబర్, మిలిటరీ

- మిగతా 2లో...

## నా మిత్రుడు అనునిత్యం నగరి కోసం తపించేవారు

- కుప్పం తరహాలో నగరి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని సీఎం హామీ
- 2029 నాటికి నగరికి కృష్ణా జలాలు తీసుకువస్తానని వెల్లడి
- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా నగరిలో సీఎం చంద్రబాబు పర్యటన
- రాష్ట్రవ్యాప్త సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్రాజెక్టులకు శంకుస్థాపన
- వలసలు నివారించేందుకు పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని స్పష్టీకరణ



పెన్ పవర్ డెస్క్:చిత్తూరు జిల్లా నగరి నియోజకవర్గాన్ని తన సొంత నియోజకవర్గమైన కుప్పం తరహాలో అభివృద్ధి చేస్తానని ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ ఇచ్చారు. 2029 ఎన్నికల నాటికి నగరికి కృష్ణా జలాలను తీసుకొచ్చి సాగు, తాగునీటి కష్టాలు తీర్చే బాధ్యత తనదని ఆయన స్పష్టం చేశారు. స్థానిక యువత ఉపాధి కోసం వలసలు వెళ్లకుండా పరిశ్రమలను తీసుకొస్తామని భరోసా ఇచ్చారు. శనివారం నగరిలో నిర్వహించిన 'స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రసంగిస్తూ అభివృద్ధిపై కీలక హామీలు ఇచ్చారు.నగరితో తనకున్న అనుబంధాన్ని ప్రస్తావిస్తూ, "నగరి తెలుగుదేశం పార్టీకి కంచుకోట. నా మిత్రుడు, దివంగత నేత గాలి ముద్దుకృష్ణమ నాయుడు ఈ ప్రాంత ప్రజల కోసం నిరంతరం తపించేవారు. గడిచిన ఐదేళ్లలో ఇక్కడ అభివృద్ధి ఆగిపోయింది. ఇప్పుడు మళ్లీ మంచి రోజులు మొదలయ్యాయి" అని వ్యాఖ్యానించారు. పేదల అభ్యున్నతి కోసం చేపట్టిన పీ4 (పేదరికంపై గెలుపు) కార్యక్రమంలో భాగంగా బంగారు కుటుంబాలను ఆదుకునేందుకు ముందుకొచ్చిన మార్గదర్శులను కూడా సీఎం సత్కరించారు. ఈ కార్యక్రమంలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే గాలి భాను ప్రకాశ్ నాయుడు, ఎంపీ డి.ప్రసాదరావు తదితర నేతలు, అధికారులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమం సందర్భంగా ముఖ్యమంత్రి రాష్ట్రవ్యాప్తంగా సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. వ్యర్థాల సేకరణ కోసం రూపొందించిన 'స్వచ్ఛ రథాల'ను జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ప్రజా వేదిక వద్ద ఏర్పాటు చేసిన మెప్మా, డ్వాక్రా మహిళల ఉత్పత్తుల స్టాళ్లను పరిశీలించి వారిని అభినందించారు. పారిశుధ్య కార్మికుల సేవలను కొనియాడుతూ పలువురిని సన్మానించారు.

"స్వచ్ఛాంధ్ర అనేది కేవలం ప్రభుత్వ కార్యక్రమం కాదు, అది మనందరి జీవన విధానం కావాలి. ఏడాది క్రితం ఒక ఉద్యమంలా ప్రారంభించిన ఈ కార్యక్రమంలో ప్రతి నెలా మూడో శనివారం నేతలు, అధికారులు పాల్గొంటున్నారు. ప్రజలంతా భాగస్వాములైతేనే దీని లక్ష్యం నెరవేరుతుంది" అని పిలుపునిచ్చారు. సమైక్యాంధ్రలో సీఎంగా ఉన్నప్పుడు తాను ప్రారంభించిన జన్మభూమి, పచ్చదనం-పరిశుభ్రత కార్యక్రమాలను ఆయన గుర్తుచేశారు.

## సినీ గ్లామర్ తో రాజకీయాల్లో విజయం సాధించడం సాధ్యం కాదు

### కేంద్ర మంత్రి శ్రీనివాస్ వర్మ



- ఎన్టీఆర్ తర్వాత సినీ ఇమేజ్ మీదే నిలదొక్కుకున్న ఉదాహరణలు లేవన్న వర్మ
- సమస్యలపై పోరాటమే రాజకీయాల్లో అసలైన బలం అని వ్యాఖ్య
- పవన్ బలమైన ప్రజా నాయకుడిగా ఎదిగారని వ్యాఖ్య

పెన్ పవర్ డెస్క్:సినిమా గ్లామర్ ఒక్కటే ఆధారంగా పెట్టుకుని రాజకీయాల్లో దీర్ఘకాల విజయం సాధించడం సాధ్యం కాదని కేంద్ర సహాయమంత్రి శ్రీనివాస్ వర్మ కీలక వ్యాఖ్యలు చేశారు. విశాఖపట్నంలో మీడియాతో మాట్లాడిన ఆయన, ఎన్టీఆర్ తర్వాత కేవలం సినీ ఇమేజ్ మీదే రాజకీయాల్లో నిలదొక్కుకున్న ఉదాహరణలు లేవని స్పష్టం చేశారు. ప్రజలతో మమేకమయ్యే నాయ కత్వం, వారి సమస్యలపై పోరాటమే రాజకీయాల్లో అసలైన బలం అని ఆయన అభిప్రాయపడ్డారు.అయితే, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను మాత్రం భిన్నంగా చూడాలన్నారు. పవన్ కల్యాణ్ కేవలం సినీ నటుడిగానే కాకుండా, ప్రజల మధ్య ఉండే బలమైన ప్రజా నాయకుడిగా ఎదిగారని శ్రీనివాస్ వర్మ ప్రశంసించారు. ప్రజా సమస్యలపై నేరుగా పోరాడటం, ప్రజలతో సన్నిహితంగా మెలగడం ఆయన ప్రత్యేకత అని పేర్కొన్నారు. అలాగే, కూటమిగా కలిసి

- మిగతా 2లో...



## విదేశాల్లో భారత్ 'వాంటెడ్'.. రెండేళ్లలో 70 మంది గుర్తింపు

- 'వాంటెడ్' జాబితాలో ఉన్న వారిలో 70 మంది విదేశాల్లో ఉన్నారు: కేంద్ర ప్రభుత్వం
- పరారీలో ఉన్న వారి గుర్తించే ప్రక్రియ ముమ్మరంగా కొనసాగుతుందన్న కేంద్రం
- ఇతర దేశాలు వెతుకుతున్న 203 మంది నిందితులు భారత్‌లో ఉన్నట్లు వెల్లడి
- వాంటెడ్ జాబితాలో ఉన్న వారిలో 27 మంది గత ఏడాది తిరిగి వచ్చినట్లు వెల్లడి

పెన్ పవర్ డెస్క్:గత రెండేళ్లలో 'వాంటెడ్' జాబితాలో ఉన్న వారిలో 70 మంది విదేశాల్లో ఉన్నట్లు గుర్తించామని కేంద్ర ప్రభుత్వం ఒక నివేదికలో తెలిపింది. వివిధ కేసుల్లో నిందితులుగా ఉండి, పరారీలో ఉన్న వారిని గుర్తించే ప్రక్రియ

- మిగతా 2లో...

## బాలికల విషయంలో ఇప్పటికీ సమాజ దృక్పథంలో మార్పు రావాల్సి ఉంది



- బాలికల పట్ల అందరూ బాధ్యతగా వ్యవహరించాలన్న కందుల దుర్గేశ్
- వారు ఆత్మవిశ్వాసంతో ఎదిగేలా తీర్చిదిద్దాలని వ్యాఖ్య
- వారి భద్రత విషయంలో నిర్లక్ష్యం చోటు చేసుకోకూడదని హెచ్చరిక

పెన్ పవర్ డెస్క్:సమాజంలో బాలికల భద్రత, వారి చదువు, ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని రాష్ట్ర మంత్రి కందుల దుర్గేశ్ అన్నారు. బాలికల విషయంలో ఇప్పటికీ సమాజ దృక్పథంలో మార్పు రావాల్సి ఉందని ఆయన వ్యాఖ్యానించారు. నిడదవోలులోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహించిన 'జాతీయ బాలికా దినోత్సవం' కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా

- మిగతా 2లో...

## బాలికలే భవిష్యత్ దీపికలు



పెన్ పవర్ డెస్క్:జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా మంత్రి నారా లోకేశ్ శుభాకాంక్షలు తెలిపారు. బాలికలే భవిష్యత్ దీపికలని పేర్కొన్నారు. 'సరైన నైపుణ్యాలు, అవకాశాలు కల్పిస్తే బాలికలు ఆకాశమే హద్దుగా రాణిస్తారు. వారి హక్కులు, విద్య, భద్రత కోసం కూటమి ప్రభుత్వం కృషి చేస్తోంది. బాలికలపై వివక్షను విడనాడదాం.. వారికి సమాన హక్కులు కల్పిద్దాం" అని లోకేశ్ అన్నారు.

## భారత్ పై తగ్గనున్న ట్రంప్ టారిఫ్ లు..!



- భారత్ పై 50 శాతం సుంకాలు వసూలు చేస్తున్న అమెరికా
- ఇటీవల రష్యా నుంచి కొనుగోళ్లు తగ్గించిన భారత్
- 25 శాతం టారిఫ్ లు తగ్గించనున్నట్లు అమెరికా ఆర్థిక మంత్రి హింట్

పెన్ పవర్ డెస్క్:భారత్ పై అమెరికా అధ్యక్షుడు విధించిన టారిఫ్ లు తగ్గించే యోచనలో ఉన్నట్లు అగ్రరాజ్యం సంకేతాలు వెలువరించింది.

- మిగతా 2లో...



## భారత్ సంస్కరణల ఎక్స్‌ప్రెస్‌గా ఎదుగుతోంది

- ప్రపంచంలో అత్యధిక యువత మన దేశంలోనే ఉందన్న ప్రధానమంత్రి
- యువతకు అవకాశాలు కల్పించడమే తమ ప్రభుత్వ ఉద్దేశమన్న మోదీ
- వివిధ దేశాలతో వాణిజ్య ఒప్పందాల ద్వారా విదేశాల్లోని భారత యువతకు అవకాశాలు లభిస్తాయని వెల్లడి

పెన్ పవర్ డెస్క్:భారతదేశం సంస్కరణల ఎక్స్‌ప్రెస్‌గా ఎదుగుతోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ప్రపంచంలోనే అత్యధిక యువత కలిగిన దేశం

- మిగతా 2లో...




# ప్రతీ చోటా జగనన్న సైన్యం... పక్కా వ్యూహం !

వైసీపీ అధినేత గత ఇరవై నెలలుగా తాను తెర వెనకన ఉంటున్నారు. పార్టీని ముందు పెడుతున్నారు. ప్రతీ ఆందోళనను పార్టీ నాయకులు చేసేలా చూస్తున్నారు. మెడికల్ కాలేజీలు ప్రైవేట్ పరం కాకుండా ఈ మధ్యన చేసిన ఆందోళన చాలా వరకూ సక్సెస్ అయింది. కోటి సంతకాల పేరుతో పార్టీలో కొంత చైతన్యం వచ్చింది. అయితే 2024లో ఓటమి తరువాత నుంచి జగన్ చేస్తున్నది చెబుతున్నదీ ఒక్కటే. పార్టీని పటిష్టంగా ఉంచాలని. పార్టీ బాగుంటేనే అంతా బాగుంటారు అని. అందుకే ఆయన కమిటీల మీదనే ఫుల్ ఫోకస్ పెట్టేశారు.

**బూత్ లెవెల్ నుంచి :**

ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గంలో బూత్ లెవెల్ నుంచి కమిటీలు వేయమని జగన్ ఆయా నియోజకవర్గం ఇంచార్జిలను కోరుతూ వస్తున్నారు. ఈ కమిటీలు కూడా కేవలం మొత్తం అనుబంధ సంఘాలతో కలిపి వేయమంటున్నారు. అంటే మహిళ, యువత, విద్యార్థి, కార్మిక, రైతు విభాగాలు అన్న మాట. ఇలా అధ్యక్షుడు ఒకరు, ఉపాధ్యక్షులు ఇద్దరు, ప్రధాన కార్యదర్శి, జాయింట్ సెక్రటరీలు ఇద్దరు, కోశాధికారి ఈ విధానంలో కమిటీలు వేసుకుంటూ వెళ్తే బూత్ లెవెల్ లోనే కనీసంగా ఒక యాభై మంది దాకా క్యాడర్ కి పదవులు దక్కుతాయి, వారంతా అక్కడ పార్టీ సైన్యంగా ఉంటారు అని లెక్క వేస్తున్నారు. అక్కడ నుంచి వార్డు, అలాగే పంచాయతీ స్థాయి, మండలాలు, నియోజకవర్గాల దాకా ఈ కమిటీలు ఉంటాయి. దీంతో ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గంలో కనీసంగా 15 వేలకు తక్కువ కాకుండా జగనన్న సైన్యం తయారు అవుతుందని అంటున్నారు.

**పదవ వంతుగా :**

ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గంలో ఓటర్లు కనీసంగా లక్షన్నర నుంచి రెండు లక్షల మంది దాకా ఉంటారు. ఆ లెక్కన తీసుకుంటే అందులో పదవ వంతుగా వైసీపీ సైన్యం ఉంటారు అన్న మాట. ప్రతీ పది మంది ఓటర్లకు ఒక వైసీపీ కమిటీ మెంబర్ అన్నట్లుగా వైసీపీ అధినాయకత్వ ఈ రాజకీయ నిష్పత్తిని ఎంచుకుంది. వీరు కనీసంగా అయిదుగురిని పార్టీ వైపు మళ్ళించినా లేక పార్టీ పక్షాన ఉంచుకున్నా ప్రతీ నియోజకవర్గంలో ఎనభై వేల ఓట్లుగా మారుతాయని ఆ మీదట ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలతో మరి కొంత యాడ్ అవుతుందని అధినాయకత్వం చేపట్టే పాదయాత్ర వంటి వాటితో ఇంకా ఆ నంబర్ పెరుగుతుందని మొత్తానికి నికరంగా ఒక లక్ష దాకా ఓట్లను ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గంలో ఉంచుకోగలిగితే ఎన్నికల్లో ఎదురు ఉండదని వైసీపీ పక్కా ప్లాన్ తోనే కమిటీల మీద ఫుల్ ఫోకస్ పెడుతోంది అని అంటున్నారు.

**జగన్ విజన్ ఇదే :**

తాజాగా విజయనగరంలో జరిగిన వైసీపీ విస్తృత స్థాయి సమావేశంలో మాజీ ఎమ్మెల్యే సీనియర్ నేత కోలగట్ల వీరభద్రస్వామి మాట్లాడుతూ జగన్ విజన్ ని ప్రతీ వారూ తెలుసుకోవాలని అన్నారు. పార్టీకి లాభం కలగాలని పార్టీ గెలవాలని ఆయన కమిటీలను ఏర్పాటు చేయమని గట్టిగా కోరుతున్నారని అన్నారు. జగన్ మాట వింటే పార్టీకి తిరుగు ఉండదని స్వామి చెప్పడం విశేషం. ప్రతీ నియోజకవర్గంలో జగనన్న సైన్యం పెద్ద ఎత్తున తయారు చేయమని అధినేత కోరుతున్నారని ఆయన అన్నారు. అంతా కష్టపడి కమిటీలను వేయాలని ఇక బూత్ లెవెల్ దాకా పార్టీని తీసుకుని వెళ్తే కనుక కచ్చితంగా మంచి ఫలితాలు ఉంటాయని చెప్పారు.

**క్యాడరే లీడర్ :**

మరో వైపు భీమిలీలో జరిగిన పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో వైసీపీ ఇంచార్జి మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ పార్టీ కమిటీలు అన్నీ పూర్తి అయిన తరువాత క్యాడర్ ని తప్పకుండా గుర్తుంచుకుంటామని చెప్పారు. అంతే కాకుండా వారికే అన్ని విధాలుగా పెద్ద పీట వేస్తామని అంటున్నారు. ఇక కార్యకర్తలు అందరికీ ఐడెంటిటీ కార్డుతో పాటు ఇన్సూరెన్స్ కూడా చేయిస్తామని ఆయన చెప్పారు. అధినాయకత్వం క్యాడర్ కే అగ్ర తాంబూలం అని చెబుతోందని అందువల్ల పార్టీ అధికారంలోకి వస్తే క్యాడరే లీడర్ అని వైసీపీ నేతలు చెబుతున్నారు.

# అమెరికాలో మంచు తుపాను విలయతాండవం...

- మొదటి పేజీ తరువాయి

దాదాపు 20 కోట్ల మందికి పైగా ప్రజలు శీతల వాతావరణం, మంచు హెచ్చరికల నీడలో జీవిస్తున్నారు. పరిస్థితి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని వాషింగ్టన్ డీసీతో పాటు అలబామా, జార్జియా, కెంటకీ, న్యూయార్క్, టెక్సాస్ సహా 16కు పైగా రాష్ట్రాలు ఇప్పటికే 'స్టేట్ ఆఫ్ ఎమర్జెన్సీ'ని ప్రకటించాయి.

ఆర్కిటిక్ ప్రాంతం నుంచి పోలార్ వోర్టెక్స్ కారణంగా దూసుకొస్తున్న అతి శీతల గాలులు, శక్తివంతమైన తుపాను వ్యవస్థతో కలవడంతో ఈ విపత్కర పరిస్థితి ఏర్పడింది. దీని ఫలితంగా దేశంలోని తూర్పు భాగమంతా భారీ హిమపాతం, గడ్డకట్టే వర్షం (ఫ్రీజింగ్ రెయిన్), స్లీట్ (మంచుతో కూడిన వర్షం)తో అల్లకల్లోలంగా మారింది. ముఖ్యంగా సదరన్ ప్లెయిన్స్, లోయర్ మిసిసిపీ వ్యాలీ, టెన్నెస్సీ వ్యాలీ, ఆగ్నేయ రాష్ట్రాల్లో కొన్నిచోట్ల "విపత్తు స్థాయి"లో మంచు పేరుకుపోయే ప్రమాదం ఉందని జాతీయ వాతావరణ సేవల విభాగం (ఎన్‌డబ్ల్యూఎస్) హెచ్చరించింది. "ఇది చాలా తీవ్రమైన తుపాను" అని యూఎస్ వెదర్ ప్రిడిక్షన్ సెంటర్ వాతావరణ శాస్త్రవేత్త జాకబ్ ఆషర్‌మాన్ అభివర్ణించారు. ఈ మంచు తుపాను కారణంగా దేశవ్యాప్తంగా జనజీవనం పూర్తిగా స్తంభించిపోయింది. విమాన ప్రయాణాలపై తీవ్ర ప్రభావం పడింది. ఫ్లైట్ అవేర్ డేటా ప్రకారం, ఈ వారాంతంలో (శని, ఆదివారాలు) ఇప్పటివరకు 8,000కు పైగా విమానాలను రద్దు చేశారు. డెల్టా, అమెరికన్, యునైటెడ్ ఎయిర్‌లైన్స్ వంటి ప్రధాన సంస్థలు ప్రయాణ హెచ్చరికలు జారీ చేసి, టికెట్ మార్పు రుసుములను రద్దు చేశాయి. ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ కూడా టెక్సాస్ నుంచి ఈశాన్య రాష్ట్రాల వరకు పలు విమానాశ్రయాల్లో కార్యకలాపాలు నిలిచిపోవచ్చని హెచ్చరించింది. మంచు ప్రభావం కేవలం ప్రయాణాలకే పరిమితం కాలేదు. గడ్డకట్టే వర్షం కారణంగా విద్యుత్ తీగలపై అంగుళం మందం వరకు మంచు పేరుకుపోయే ప్రమాదం ఉంది. దీనివల్ల విద్యుత్ లైన్లు తెగిపోయి, చెట్లు కూలిపోయి సుదీర్ఘకాలం పాటు విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడవచ్చని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. టెక్సాస్‌లో ఇప్పటికే దాదాపు 20,000 మంది, ఓక్లహోమా, ఆర్కాన్సాస్‌లలో వేలాది మంది విద్యుత్ లేకుండా ఇబ్బందులు పడుతున్నారు. 2021 నాటి విద్యుత్ సంక్షోభం నుంచి పాఠాలు నేర్చుకున్నామని, ఈసారి విద్యుత్ గ్రిడ్‌ను సిద్ధంగా ఉంచామని టెక్సాస్ అధికారులు చెబుతున్నారు.

ప్రభుత్వ యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తమైంది. ఫెడరల్ ఎమర్జెన్సీ మేనేజ్‌మెంట్ ఏజెన్సీ (ఫీమా) దాదాపు 30 సహాయక బృందాలను సిద్ధంగా ఉంచింది. ఆహారం, దుప్పట్లు, జనరేటర్లను కీలక ప్రాంతాలకు తరలించింది. పలు రాష్ట్రాల్లో నేషనల్ గార్డ్ దళాలను మోహరించారు. వాషింగ్టన్ డీసీ మేయర్ మురియల్ బౌజర్ మాట్లాడుతూ, "మేము అధికారికంగా స్నో ఎమర్జెన్సీ, స్టేట్ ఆఫ్ ఎమర్జెన్సీని ప్రకటించాం" అని తెలిపారు. చికాగోలో పాఠశాలలకు సెలవులు ప్రకటించగా, లూసియానాలో కార్నివాల్ పరేడ్‌లు, నాష్‌విల్లేలో పలు కార్యక్రమాలు రద్దయ్యాయి.

ఈ తుపాను సోమవారం వరకు కొనసాగి, న్యూయార్క్, బోస్టన్ వంటి ప్రధాన నగరాలపై ప్రభావం చూపనుంది. తుపాను తగ్గుముఖం పట్టినా, ఆ తర్వాత కూడా అత్యంత శీతల గాలులు, ప్రమాదకరమైన వాతావరణం కొనసాగుతుందని, ప్రజలు అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావద్దని అధికారులు హెచ్చరిస్తున్నారు.

# సినీ గ్లామర్ తో రాజకీయాల్లో విజయం సాధించడం సాధ్యం కాదు

- మొదటి పేజీ తరువాయి

ఎన్నికలకు వెళ్లడం వల్లే ఇటీవల జరిగిన ఎన్నికల్లో విజయం సాధ్యమైందని ఆయన గుర్తుచేశారు.

ఇక జాతీయ రాజకీయాల విషయానికి వస్తే, ప్రస్తుతం దేశంలో సినీ స్టార్లను మించిన స్టార్ ప్రధాని నరేంద్ర మోదీ అని శ్రీనివాస్ వర్మ వ్యాఖ్యానించారు. మోదీ నాయకత్వంలోనే బీజేపీ దేశవ్యాప్తంగా బలపడుతోందని చెప్పారు. రాబోయే రోజుల్లో పశ్చిమ బెంగాల్, కేరళ, తమిళనాడు వంటి రాష్ట్రాల్లో కూడా బీజేపీ విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. రాజకీయ పొత్తుల విషయంలో అగ్రనాయకత్వమే చర్చించి తుది నిర్ణయం తీసుకుంటుందని ఆయన స్పష్టం చేశారు.

మరోవైపు విశాఖ స్టీల్ ప్లాంట్ అంశంపై కూడా ఆయన స్పందించారు. స్టీల్ ప్లాంట్ పరిరక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం నిరంతరం సమీక్షలు నిర్వహిస్తోందని తెలిపారు. ఆర్థిక భారం తగ్గించే క్రమంలోనే సీఐఎస్ఎఫ్ బలగాల ఉపసంహరణ జరిగిందని వివరణ ఇచ్చారు. ఫిబ్రవరి 4న ఉక్కు శాఖ కార్యదర్శి విశాఖ స్టీల్ ప్లాంట్‌ను సందర్శించి అక్కడి పరిస్థితులపై సమీక్ష నిర్వహించనున్నారని వెల్లడించారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కాపాడటానికి కేంద్ర ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని మరోసారి స్పష్టం చేశారు.

# భారత్ సంస్కరణల ఎక్స్‌ప్రెస్‌గా ఎదుగుతోంది

- మొదటి పేజీ తరువాయి

మనదని ఆయన అన్నారు. దేశవ్యాప్తంగా 45 ప్రదేశాల్లో 18వ రోజ్‌గార్ మేళాను నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రధాని మోదీ వర్చువల్‌గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భారతదేశం సంస్కరణల దిశగా ముందుకు సాగుతోందని, ఇందుకోసం వివిధ దేశాలతో వాణిజ్య, మొబిలిటీ రంగాల్లో ఒప్పందాలు కుదుర్చుకుంటున్నామని తెలిపారు. తద్వారా భారతీయ యువతకు ప్రభుత్వం అనేక అవకాశాలను సృష్టిస్తోందని ఆయన అన్నారు. యువతకు ఉద్యోగం లక్ష్యంగా ప్రారంభమైన రోజ్‌గార్ మేళా కార్యక్రమం ఇప్పుడు ఒక సంస్థగా రూపాంతరం చెందిందని అన్నారు. రోజ్‌గార్ వేదికగా దేశంలోని లక్షలాది మంది ఉద్యోగాలు పొందారని

ఆయన వెల్లడించారు. యువతకు సరైన, సమగ్ర అవకాశాలు కల్పించడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. అందుకు తమ ప్రభుత్వం నిబద్ధతతో పనిచేస్తోందని చెప్పారు. వివిధ దేశాలతో వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకుంటున్నామని, దీని ద్వారా దేశ, విదేశాల్లో ఉన్న భారతీయ యువతకు విస్తృత అవకాశాలు లభిస్తాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు.

# 40 ఏళ్లుగా గర్భం మోసిన మహిళ.. 82 ఏళ్ల వయసులో నొప్పులు.. కట్ చేస్తే!



మాతృత్వం అనేది పెళ్లి అయిన ప్రతి ఒక్క మహిళ కల. ఏడు నెలలు లేదా తొమ్మిది నెలలు మోసి పండంటి బిడ్డకు జన్మనిస్తుంది తల్లి. ఇక ఆ బిడ్డను అల్లారు ముద్దుగా అపురూపంగా చూసుకుంటూ జీవితం ధన్యం చేసుకుంటూ ఉంటుంది. అయితే ఇక్కడ ఒక మహిళ ఏడు కాదు తొమ్మిది కాదు ఏకంగా 40 ఏళ్ల పాటు గర్భవతిగా ఉండి.. చివరికి 82 సంవత్సరాల వయసులో నొప్పులు రావడంతో హాస్పిటల్ కి వెళ్ళింది. పరీక్షించిన వైద్యులు అసలు విషయం తెలుసుకొని ఆశ్చర్యపోయారు. మరి 40 ఏళ్ల పాటు ఆ తల్లి తన గర్భంలో బిడ్డను మోసి.. 82 సంవత్సరాల వృద్ధాప్యంలో నొప్పులు రావడం ఏంటి? ఇది నిజంగా నిజమేనా? కనీసం ఈ విషయం ఆమెకు కూడా తెలియలేదా? అని కొంతమంది ఆశ్చర్యపోతున్నారు. మరి అసలు విషయం ఏమిటో ఇప్పుడు చూద్దాం. సాధారణంగా కొన్ని కొన్ని సంఘటనలు నమ్మశక్యం కానీ నిజాలుగా మారుతున్న వేళ. ప్రతి ఒక్కరు ఆశ్చర్యంతో నోరెళ్ళబడుతున్నారు. అదెలా సాధ్యమనే ఆలోచనలో పడిపోతున్నారు. అలాంటి ఒక సంఘటనకు సంబంధించిన వార్త ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవ్వడంతో అందరూ ఆశ్చర్యపోతున్నారు. అసలు విషయంలోకి వెళ్తే.. ప్రస్తుతం ఒక మహిళ వయసు 82 సంవత్సరాలు. ఒక్కసారిగా భరించలేని కడుపునొప్పి రావడంతో ఆమె కుటుంబ సభ్యులు ఆమెను హాస్పిటల్ కి తీసుకెళ్లారు. ఆమెను పరీక్షించిన వైద్యులు లోపల కణితి ఉంటుందని భావించారు. కానీ స్కానింగ్ తర్వాత అసలు విషయం తెలిసి ఆశ్చర్యపోయారు. కారణం ఆమె శరీరంలో 40 సంవత్సరాలకు పైగా ఒక కాల్సిఫైడ్ గర్భస్థ శిశువు ఉంది. అంటే 40 సంవత్సరాలుగా ఆమె గర్భవతి అన్నమాట. ఈ అరుదైన పరిస్థితిని వైద్య పరిభాషలో లిథోపెడియన్ లేదా స్టోన్ బేబీ అని పిలుస్తారు. అంటే గత 40 ఏళ్ల క్రితం ఆ మహిళకు ఎక్టోపిక్ గర్భం ఏర్పడిందట . అంటే గర్భస్థ శిశువు గర్భం లోపల కాకుండా గర్భం బయట అభివృద్ధి చెందడం.. దీని కారణంగానే ఆ మహిళకు పురిటి నొప్పులు అందరి లాగే రావడం , బిడ్డను కనడం వంటి పరిస్థితి ఎదురు కాలేదు.

పైగా ఈ సంక్రమణను నిరోధించడానికి అనుగుణంగా ఆమె శరీరం గర్భస్త శిశువును క్యాల్షియంతో ఆవరించి ఒక రక్షణ కవచాన్ని ఏర్పాటు చేసిందట. ఫలితంగా శిశువు గర్భాశయం వెలుపలి భాగంలో ఒక మమ్మీ సైడ్ రూపంగా మారి నిశ్శబ్దంగా ఉండిపోయింది. అందుకే ఎటువంటి గర్భస్థ లక్షణాలను కూడా కనబరచలేకపోయింది. నిజానికి ఇలాంటి సంఘటనలు చాలా అరుదుగా మాత్రమే జరుగుతాయట. వైద్య చరిత్రలో ఇప్పటివరకు కేవలం 300 కేసులు మాత్రమే గుర్తించినట్లు వైద్యులు తెలిపారు. ఇకపోతే ఈ విషయం ఎక్కడ? ఎప్పుడు? ఎవరిలో జరిగింది అనే పూర్తి వివరాలు మాత్రం లేవు. కానీ సోషల్ మీడియాలో మాత్రం ఈ వార్త వైరల్ అవ్వడంతో అందరూ ఆశ్చర్యపోతున్నారు. ఏది ఏమైనా ఇలాంటి సంఘటనలు అందరినీ ఆశ్చర్యానికి గురి చేస్తున్నాయి.

# బాలికల విషయంలో ఇప్పటికీ సమాజ దృక్పథంలో మార్పు రావాల్సి ఉంది

- మొదటి పేజీ తరువాయి

ఆయన మాట్లాడుతూ... ఆడపిల్లలను కేవలం కాపాడుకోవడమే కాదు, వారిని ఉన్నత విద్యావంతులుగా, ఆత్మవిశ్వాసంతో ఎదిగేలా తీర్చిదిద్దాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, గురువులు, సమాజం అందరిపైనా ఉందన్నారు. బాలికల అక్రమ రవాణా, లైంగిక వేధింపులు వంటి వాటికి గురికాకుండా కాపాడటం అత్యంత కీలకమని చెప్పారు. బాలికల హక్కుల పరిరక్షణలో తల్లిదండ్రులు మాత్రమే కాదు... అధికారులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు కూడా భాగస్వాములేనని మంత్రి గుర్తు చేశారు. బాలికల భద్రత విషయంలో నిర్లక్ష్యం చోటు చేసుకోకూడదని హెచ్చరించారు.

# భారత్ పై తగ్గనున్న ట్రంప్ టారిఫ్ లు..!

- మొదటి పేజీ తరువాయి

రష్యా నుంచి ఆయిల్ కొనుగోలు చేస్తున్నందుకు డొనాల్డ్ ట్రంప్ భారత్ పై 25 శాతం సుంకాలు విధించిన విషయం తెలిసిందే. ప్రతీకార సుంకాలు 25 శాతం కలిపి మొత్తంగా మన దేశంపై 50 శాతం సుంకాలు విధించారు. భారత్ నుంచి అమెరికాకు ఎగుమతయ్యే వస్తుసేవలపై ట్రంప్ ప్రభుత్వం 50 శాతం సుంకాలు వసూలు చేస్తోంది. అయితే, ఇటీవల రష్యా చమురు కొనుగోళ్లను భారత్ తగ్గించింది. దీంతో అమెరికా సుంకాలు సగానికి తగ్గే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ విషయాన్ని అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు.

# విదేశాల్లో భారత్ 'వాంటెడ్'.. రెండేళ్లలో 70 మంది గుర్తింపు

- మొదటి పేజీ తరువాయి

ముమ్మరంగా కొనసాగుతుందని వెల్లడించింది. అదే సమయంలో ఇతర దేశాలు వెతుకుతున్న 203 మంది నిందితులు భారత్‌లో ఉన్నారని ఈ నివేదిక పేర్కొంది. పరారీలో ఉన్న వారిని విదేశాల్లో ఇంత పెద్ద మొత్తంలో గుర్తించడం గత దశాబ్ద కాలంలో ఇదే మొదటిసారి అని తెలిపింది.

వాంటెడ్ జాబితాలో ఉన్న వారిలో 27 మంది గత సంవత్సరం విదేశాల నుంచి తిరిగి వచ్చారని భారత ప్రభుత్వం వెల్లడించింది. సీబీఐ కేసులకు సంబంధించి ఏడాది వ్యవధిలో 74 రొగేటరీ లెటర్స్ పంపించినట్లు తెలిపింది. దర్యాప్తునకు సహకరించాలని విదేశీ న్యాయస్థానాలకు రాసే లేఖను రొగేటరీ లెటర్స్ అంటారు. ఈ లేఖల్లో 54 సీబీఐ, మరో 20 రాష్ట్ర దర్యాప్తు బృందాలు రాసినట్లు పేర్కొంది.

# మావోయిస్టులకు మరో ఎదురుదెబ్బ...

## ఇద్దరు మావోలు అరెస్ట్

- మొదటి పేజీ తరువాయి

ఇన్ స్ట్రక్టర్ మీసాల సాల్మన్ అలియాస్ సంతోశ్ నాగరాజు, డీవీసీఎం అయిన ఆయన భార్యను నాగర్ కర్నూలు పోలీసులు అరెస్ట్ చేశారు. అచ్చంపేటకు వచ్చిన వీరు... మావోయిస్టు ఫ్రంట్ సంస్థల నేతల సాయంతో మావోయిస్టు కార్యకలాపాలను తిరిగి పునరుద్ధరించేందుకు ప్రయత్నిస్తుండగా పోలీసులు అరెస్ట్ చేశారు. వీరితో పాటు మహబూబ్ నగర్, నల్లమల ప్రాంతాల్లో మావోయిస్టులకు సహకరిస్తూ, వారికి ఆశ్రయం కల్పిస్తున్న మరో ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వీరిలో సివిల్ లిబర్టీస్ కమిటీ జాయింట్ సెక్రటరీ జక్క బాలయ్య, తెలంగాణ ప్రజాఫ్రంట్ కో-కన్వీనర్ ఎడ్ల అంబయ్య, మంశెట్టి యాదయ్య ఉన్నారు. ఎర్టిగా కారులో మన్ననూరు నుంచి అచ్చంపేటకు వెళుతున్న సమయంలో వీరిని అరెస్ట్ చేసినట్టు పోలీసులు తెలిపారు.

# కూటమి పక్కన పెట్టింది...వైసీపీ షాక్ ఇచ్చేసింది

వైసీపీ అధికారంలోకి వచ్చాక గ్రామ వార్డు సచివాలయాలను ఏర్పాటు చేసింది. అంతే కాదు ఏకంగా రెండు లక్షల డెబ్బై వేల మంది దాకా వాలంటీర్లను తీసుకుంది. వీరికి గౌరవ వేతనంగా అయిదు వేల రూపాయలను ఇచ్చింది. వీరిని ప్రతీ యాభై కుటుంబాలకు బాధ్యులుగా చేసింది. ఆ విధంగా వీరు తమకు రాజకీయంగా ఉపయోగపడతారు అని భావించింది. కానీ విషయం చూస్తే మొత్తానికి మొత్తం బూమరాంగ్ అయింది.

**రెండింటికీ చెడి :**

వాలంటీర్లను తీసుకుని వచ్చి వైసీపీ పార్టీ నాయకులను క్యాడర్ ని పూర్తిగా పక్కన పెట్టేసింది. అన్నీ వారే చూస్తారు అని ధీమా పడింది. తీరా ఎన్నికల సమయంలో ఈసీ తీసుకున్న నిర్ణయంతో వాలంటీర్లు అంతా సైడ్ అయిపోయారు. మరో వైపు కూటమి నేతలు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వారు వైసీపీని వదిలేసి ఆ వైపుగా పనిచేసారు. కూటమి అధికారంలోకి వస్తే పది వేల రూపాయల గౌరవ వేతనం ఇస్తామని ఇచ్చిన హామీతో వైసీపీని వారే ఓడించేశారు. ఇలా వైసీపీ వ్యూహాలు రెండిందాలుగా చెడిపోయి ఎన్నడూ లేని విధంగా భారీ పరాజయాన్ని మూటకట్టుకుంది.

**కొన్నాళ్ళు ఆందోళన :**

వాలంటీర్లు అయితే కూటమి అధికారంలోకి వచ్చిన కొత్తల్లో కొన్నాళ్ళ పాటు ఆందోళనలు నిర్వహించారు. తమకు పది వేల రూపాయల వేతనం ఇస్తామని చెప్పారని తమను విధులలోకి తిరిగి తీసుకోవాలని వారు కోరారు. అయితే వారి సేవలను 2023 ఆగస్టు నుంచే వైసీపీ ప్రభుత్వం రెన్యూవల్ చేయలేదని టెక్నికల్ సాకులు చూపించి కూటమి ప్రభుత్వం పక్కన పెట్టేసింది. అదే సమయంలో నెలవారీగా అందించే సామాజిక పెన్షన్లను కూడా సచివాలయ ఉద్యోగుల చేత అందిస్తోంది. ఈ క్రమంలో వాలంటీర్ల సేవలు అందడం లేదని ఎవరూ అనుకోవడం లేదు, క్రమంగా వారి గురించి కూడా అంతా మరచిపోయారు.

# సాంకేతిక సాక్ష్యాలతో నేరస్తులకు శిక్షలు పడేలా చేయాలి

## నెలవారీ నేర సమీక్షా సమావేశం లో తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ డి. నరసింహ కిషోర్



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జనవరి 24:** జిల్లా పోలీస్ కార్యాలయంలో గల కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా పోలీసు అధికారులతో జిల్లాలో పెండింగ్ లో ఉన్న గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసులు, ప్రాపర్టీ కేసులు, ఎన్ఫోర్స్మెంట్ వర్క్, డిపిఓ కు సంబంధించి పెండింగ్ రిప్లై ఫైల్స్, పెండింగ్ ఎన్ బి డి లు, ఎన్ డి పీ ఎస్ కేసులలో దర్యాప్తు, రికవరీల గురించి సర్కిల్ వారీగా పోలీస్ అధికారులతో జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ నెలవారి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ అధికారులకు పలు సూచనలు చేశారు . ప్రతి కేసులో సాంకేతిక సాక్ష్యాలు సేకరించి, అందుబాటులో ఉన్న టెక్నాలజీని ఉపయోగించి దర్యాప్తు చేయాలన్నారు. తద్వారా కన్విక్షన్ రేటు పెంచవచ్చునని , పి.జి.ఆర్.ఎస్ ఫిర్యాదుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపించాలన్నారు.

జిల్లాలో మహిళల భద్రతకు గట్టి చర్యలు తీసుకోవాలనీ, ఓపెన్ డ్రింకింగ్ నేరాలను నియంత్రించాలన్నారు. ఓపెన్ డ్రింకింగ్ పై ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలతో పాటు, డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించాలన్నారు. రౌడీ షీటర్ల కదలికలు, కార్యకలాపాలపై నిరంతరం నిఘా ఉంచాలన్నారు. గ్రేవ్ కేసులలో నిర్ణీత గడువు లోపల విచారణ పూర్తి చేసి, ఛార్జ్ షీట్ దాఖలు చేయాలని . ప్రాపర్టీ క్రైమ్ కేసుల్లో రికవరీ పెంచాలన్నారు. జిల్లా వ్యాప్తంగా గుర్తించిన బ్లాక్ స్పాట్లలో డ్రోన్ సర్వైలెన్స్ విరివిగా ఏర్పాటు చేయాలని, ముఖ్యమైన అన్ని ప్రాంతాలలో సి సి కెమెరాలను ఏర్పాటు చేసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాల న్నారు. అనుమానిత ప్రాంతాలలో కార్డన్ ఆపరేషన్స్ నిర్వహించాలని, సంబంధిత పోలీసు అధికారులు విలేజ్ విజిట్స్ తప్పక చేయాలన్నారు. తద్వారా రాబోయే ఎన్నికల్లో ఎదురయ్యే వివిధ సమస్యలను అరికట్టవచ్చునని రాత్రి పూట అన్ని స్టేషన్ల లలో గస్తీలు ముమ్మరం చెయ్యాలని, అనుమానితుల వేలిముద్రలు ఎం ఎస్ డి డివైస్ ద్వారా చెక్ చేయాలన్నారు .

# గోదావరి పుష్కరాలకు రోజు వారి కార్యాచరణతో ప్రణాళికలు



✹ ఇంచార్జి జిల్లా కలెక్టర్ మేఘా స్వరూప్

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జనవరి 24:** రానున్న 2027 గోదావరి పుష్కరాలకు 516 రోజుల సమయం మాత్రమే ఉన్నందున, ఇప్పటి నుంచే ప్రతి రోజూ చేపట్టాల్సిన పనులపై సమగ్ర కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారని ఇంచార్జి జిల్లా కలెక్టర్ వై. మేఘా స్వరూప్ తెలిపారు. 2027 జూన్ 26 నుంచి జులై 7 వరకు 12 రోజుల పాటు నిర్వహించనున్న గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై ముఖ్యమంత్రి అమరావతి నుంచి తొలిసారిగా అత్యున్నత స్థాయి సమీక్ష నిర్వహించారన్నారు. ఈ సమీక్షకు బొమ్మూరు కలెక్టరేట్ నుంచి ఇంచార్జి జిల్లా కలెక్టర్ వై. మేఘా స్వరూప్, జిల్లా రెవెన్యూ అధికారి టి. సీతారామమూర్తి, ఇరిగేషన్, సమాచార పౌర సంబంధాల శాఖల అధికారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. గోదావరి ప్రవహించే పోలవరం, ఏలూరు, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, అంబేద్కర్ కోనసీమ, కాకినాడ జిల్లాల్లో పుష్కరాల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లపై సీఎం సమీక్షించారు. ప్రస్తుతం ఉన్న 234 ఘాట్లతో పాటు కొత్తగా 139 ఘాట్ల నిర్మాణం చేపట్టాలని, నదీ తీరం వెంబడి మొత్తం 9,918 మీటర్ల పొడవున 373 ఘాట్ల అభివృద్ధికి ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు. దేశ, విదేశాల నుంచి సుమారు 10 కోట్ల మంది భక్తులు గోదావరి పుష్కర స్నానానికి రాష్ట్రానికి రానున్నారని అంచనా వేస్తున్నరన్నారు . ఈ నేపథ్యంలో, భక్తులకు అసౌకర్యం కలగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. పుష్కరాలకు ముందే పోలవరం ప్రాజెక్టు పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని , ముఖ్యమంత్రిగా తన హయాంలో మూడోసారి గోదావరి పుష్కరాలు నిర్వహించడం తన అదృష్టమని వ్యాఖ్యానించారు.

ఈ సందర్భంగా గోదావరి పుష్కరాల ప్రత్యేక అధికారి జి. వీర్య పాండ్యన్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కార్యాచరణను వివరించగా, జిల్లా కలెక్టర్లు, అనుబంధ శాఖల అధికారులకు సీఎం స్పష్టమైన దిశానిర్దేశం చేశారని ఇంచార్జి జిల్లా కలెక్టర్ వై. మేఘా స్వరూప్ తెలిపారు. పోలవరం ప్రాజెక్టు ద్వారా గోదావరిలో నీటి విడుదల జరిగేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారని గోదావరి పుష్కరాల ప్రత్యేక అధికారి జి. వీర్య పాండ్యన్ తెలిపారు. ఈ మేరకు గోదావరి పుష్కరాల యాక్షన్ ప్లాన్?పై రాష్ట్ర ఉన్నత స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించగా, త్వరలో గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్?తో సమావేశం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. పుష్కరాల ఏర్పాట్ల కోసం ఖాళీ ప్రదేశాల గుర్తింపునకు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ చర్యలు చేపడుతున్నామని, శాఖల వారీగా పనుల పురోగతిని వెబ్ పేజీ ద్వారా పర్యవేక్షించనున్నట్లు తెలిపారు. భక్తుల భద్రత దృష్ట్యా యాంటీ ఫైర్ మెటీరియల్?తో టెంట్లు ఏర్పాటు చేయడంపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను సూచించారు.

# పశువుల అక్రమ రవాణా గుట్టు రట్టు





ట్రాక్టర్‌ను ఢీకొన్న డీసీఎం వాహనం

**చింతూరు, పెన్ పవర్ జనవరి 24:** చింతూరు మండల పరిధిలోని నెల్లిపాక గ్రామ సమీపంలో ట్రాక్టర్‌ను డీసీఎం వాహనం ఢీకొన్న ఘటనలో పశువుల అక్రమ రవాణా వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఈ ప్రమాదంలో డీసీఎం వాహనంలో అక్రమంగా తరలిస్తున్న పశువులు ఉన్నట్లు గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకొని వాహనాలను పరిశీలించారు. పశువులను అనుమానాస్పదంగా తరలిస్తున్నట్లు నిర్ధారణ కావడంతో డీసీఎం వాహనాన్ని స్వాధీనం చేసుకుని, పశువులను రక్షించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, అక్రమ రవాణాకు పాల్పడిన వ్యక్తులపై దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. పశువుల అక్రమ రవాణాపై కఠిన చర్యలు తప్పవని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా నిఘా మరింత కట్టుదిట్టం చేస్తామని అధికారులు హెచ్చరించారు.

పెన్ పవర్
పోలవరం - ఏలూరు
తూర్పుగోదావరి - పశ్చిమ గోదావరి



# భారత పౌరులుగా దేశభక్తితో సాగాలి

: మంత్రి కందుల దుర్గేష్

నన్నయలో ఘనంగా వందేమాతరం 150 ఏళ్ల వేడుకలు



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జనవరి 24:** వందేమాతరం గేయం రచించి 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో శనివారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయానికి అనుబంధమైన అనుబంధిత కళాశాలల నుంచి 20,000 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు. భారత స్వాతంత్ర ఉద్యమంలో కీలకంగా మారిన వందేమాతరం స్ఫూర్తిని స్మరించుకుంటూ విశ్వవిద్యాలయం ఈ కార్యక్రమాన్ని నిర్వహించగా, ప్రజాప్రతినిధులు, పరిపాలనా అధికారులు, విద్యావేత్తలు, విద్యార్థులు దేశభక్తి, సాంస్కృతిక వారసత్వం, జాతీయ చైతన్యంపై సమిష్టిగా ఆలోచించే వేదికగా కార్యక్రమం నిలిచింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ ఎస్. ప్రసన్న శ్రీ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యాటక, సంస్కృతి సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్, రూడా చైర్మన్ బొద్దు వెంకట రమణ చౌదరి హాజరై 25 వేల చదరపు అడుగుల భారీ జాతీయ జెండా ప్రదర్శన ర్యాలీని ప్రారంభించారు. ఎన్.సి.సి విద్యార్థులు గౌరవ వందనాన్ని అతిథులు స్వీకరించి , ఆహ్వాన నృత్యాన్ని తిలకించారు. వీసీ ఆచార్య ఎస్ ప్రసన్నశ్రీ జాతీయ జెండాను ఎగురవేశారు. యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె. వి. స్వామి ఓటర్ల దినోత్సవ ప్రతిజ్ఞను నిర్వహించారు. వీసీ ఆచార్య ఎస్ ప్రసన్నశ్రీ మాట్లాడుతూ విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించడానికి వందేమాతరం 150 ఏళ్ల వేడుకలు నిర్వహించామని, ఉమ్మడి గోదావరి జిల్లాల్లోని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం అనుబంధ కళాశాలల విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేశారన్నారు. మహాకవి బంకించంద్ర చటర్జీ స్వరపరిచిన ఈ రెండు పదాలు భారతదేశ స్వాతంత్ర్య పోరాటానికి హృదయ స్పందనగా మారాయని చెప్పారు. ఐక్యమైన యువ ముఖాల సముద్రాన్ని చూడటం నిజమైన విజయం అన్నారు. సుమారు 20 వేల మంది విద్యార్థులు సామూహికంగా వందేమాతర గేయాన్ని ఆలపించడానికి విశ్వవిద్యాలయం వేదిక కావడం ఆనందంగా ఉందన్నారు. మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ తెలుగు భాషకు తొలి నుడికారం దిద్దిన ఆదికవి నన్నయ పేరుతో ఉన్న విశ్వవిద్యాలయ ప్రాంగణంలో పెద్ద ఎత్తున వందేమాతరం 150 ఏళ్ల వేడుకలు నిర్వహించడం గర్వకారణం అన్నారు. మహనీయులను స్మరించుకోవడం కనీస కర్తవ్యం. భారత త్రివర్ణ పతాకం గర్వకారణం, ఆంధ్రుడైన పింగళి వెంకయ్య ఈ జెండాను రూపొందించారని స్మరించుకున్నారు. . బంకిమ్ చంద్ర చటర్జీ రచించిన వందేమాతర గేయం ఎంతో స్ఫూర్తిని ఇస్తుందని, ఆ గేయాన్ని ఎల్లవేళల స్మరించుకోవాలన్నారు. విద్యార్థులు సామూహికంగా వందేమాతర గేయాలాపన చేశారు. అనంతరం అతిథులను సన్మానించి నన్నయ జ్ఞాపికలను అందజేసి అభినందించారు

# 3 లక్షల విలువైన గంజాయి స్వాధీనం

ఒక యువకుడు అరెస్ట్



**చింతూరు పెన్ పవర్ జనవరి 24:** పోలీసులు గంజాయి అక్రమ రవాణాపై చేపట్టిన దాడుల్లో భారీగా గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. చింతూరు బస్‌స్టాండ్ ఆవరణలో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఒక యువకుడిని పోలీసులు తనిఖీ చేయగా, అతని వద్ద రూ.3 లక్షల విలువైన 6 కిలోల గంజాయి ఉన్నట్లు గుర్తించారు. ఈ ఘటనకు సంబంధించి నిందితుడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఒడిశా నుంచి చింతూరు మీదుగా గంజాయిని అక్రమంగా తరలించే ప్రయత్నం చేస్తున్న సమయంలోనే పట్టుకున్నామని వెల్లడించారు. కేసు నమోదు అనంతరం నిందితుడిని చింతూరు పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారణ చేపట్టినట్లు పేర్కొన్నారు. జిల్లాలో గంజాయి అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకుంటామని, ఇలాంటి కార్యకలాపాల్లో పాల్గొనేవారిపై చట్టపరంగా కఠినంగా వ్యవహరిస్తామని పోలీసులు హెచ్చరించారు.

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
'ఐదు రోజులకు'
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి'
93948 55244

# గురురత్న పురస్కారానికి నారాయణపురం ప్రిన్సిపాల్ ఎంపిక



**పెన్ పవర్, ఉంగుటూరు । జనవరి 24:** ఆంధ్రతెలంగాణ రాష్ట్రాల 2026 గురురత్న అవార్డుకు ఉంగుటూరు మండలం నారాయణపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల జంతు శాస్త్ర అధ్యాపకులు, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ బెజగం శ్రీనివాసు ఎంపికయ్యారు. చెన్నైలోని డాక్టర్ జే. రామచంద్రన్ మారిటైమ్ ఫౌండేషన్ యూనివర్సిటీ విద్యారంగంలో విశేష సేవలు అందించిన వారికి ప్రతి సంవత్సరం గురురత్న అవార్డులను ప్రదానం చేస్తోంది. ఈ క్రమంలో ఇంటర్మీడియట్ విద్యా వ్యవస్థలో గత 37 సంవత్సరాలుగా అధ్యాపకుడిగా, రచయితగా, విద్యా వ్యాసకర్తగా సేవలందించడంతో పాటు ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ సంఘం అసోసియేట్ ప్రెసిడెంట్గా బాధ్యతలు నిర్వహిస్తూ విద్యారంగ అభివృద్ధికి కృషి చేస్తున్న డాక్టర్ శ్రీనివాసును ఈ అవార్డుకు ఎంపిక చేశారు.

ఈ నెల 25వ తేదీన చెన్నైలో నిర్వహించే కార్యక్రమంలో ఆయనకు గురురత్న అవార్డు, మెమెంటోతో పాటు నగదు బహుమతి అందజేయనున్నారు.

# బాలికలే భవిష్యత్తు దీపికలు




✹ బాలికల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ

✹ ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి

**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, జనవరి 25:** బాలికల భవిష్యత్తుకు కూటమి ప్రభుత్వం పూర్తి స్థాయిలో భరోసా కల్పిస్తోందని రంపచోడవరం ఎమ్మెల్యే, రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్ మిరియాల శిరీషాదేవి జాయింట్ కలెక్టర్ స్మరణ్ రాజె లిపారు. శనివారం రంపచోడవరంలో మండల విద్యాశాఖాధికారి నరసింహారావు అధ్యక్షతన నిర్వహించిన జాతీయ బాలికల దినోత్సవం కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భవిష్యత్తులో అన్ని రంగాల్లో బాలికలే ముందుండి దేశాన్ని నడిపిస్తారన్నారు. బాలికల్లో ఆత్మవిశ్వాసం, చైతన్యం పెంపొందించేందుకు కూటమి ప్రభుత్వం విలువలతో కూడిన విద్యా విధానాలతో పాటు ఆత్మరక్షణకు కరాటే వంటి నైపుణ్య శిక్షణలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. బాలికలు సమాజంలో ఎలా ఉండాలి, వారి హక్కులు, విద్య, భద్రత, మంచి జీవనశైలి వంటి అంశాలపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. బాలికలు కష్టపడి చదువుకుని ఉజ్వల భవిష్యత్తును సాధించాలన్నారు. ఇందుకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, సహాయ సహకారాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమాన హక్కులు, సమాన అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, తన వంతు సహాయ చర్యల్లో ఎల్లప్పుడూ ముందుంటానని ఆమె భరోసా ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి, ఐటిడిఏ పీవో స్మరణ్ రాజుతో కలిసి బాలికలతో ర్యాలీలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు గొర్లె సునీత, రాష్ట్ర దూదేకుల కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ సుభాని, మండల పార్టీ అధ్యక్షుడు పెంటపాటి అనంత మోహన్, ఏఎంసీ వైస్ చైర్మన్ సలాది బాపిరాజు, అరకు పార్లమెంట్ ఉపాధ్యక్షుడు అడబాల బాపిరాజు, నియోజకవర్గ ఎస్టీ విభాగం అధ్యక్షుడు పండా చెల్లన్న దొర, క్లస్టర్ ఇంచార్జి కారం సింహాచలం, జనసేన ప్రతినిధి పాపోలు శ్రీనివాసరావు, రంపచోడవరం సర్పంచ్ మంగా బొజ్జయ్య, సిద్ధా వెంకన్న దొర, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు చోటు, షరీఫ్, మాజీ సర్పంచ్ నిరంజనీ దేవి, రమణ, సూరిబాబు, గణపతి, మండల విద్యాశాఖాధికారి నరసింహారావు, ఎంపీడీఓలు బీవీవీ ప్రసాద్, ఎస్. సాల్మన్ రాజ్, కిషోర్, ఐసిడిఎస్ సీడీపీఓ శాంతకుమారి, సూపర్వైజర్లు రవళి, చంద్రమ్మ, వెలుగు ఏపీఎం శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

# త్వరలోనే గోరక్షణ పేట రోడ్డు నిర్మాణం చేపడతాం

- సేవ్ రాజమండ్రి కాదు .. సేవ్ వైసీపీ
- కేడర్ పై దృష్టి పెట్టుకోవాలి



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జనవరి 24:**కూటమీ ప్రభుత్వం గత 18 నెలలుగా నగరంలో కోట్ల రూపాయల వ్యయంతో మౌలిక వసతులను, అభివృద్ధి పనులను శరవేగంగా చేపడుతోందని తెలుగుదేశం పార్టీ నగర అధ్యక్షుడు మజ్జి రాంబాబు అన్నారు. గత ప్రభుత్వంలో గత ప్రజా సమస్యలను గాలికి వదిలేయడం వల్ల ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడ్డారని మజ్జి గుర్తు చేశారు. స్థానిక గోరక్షణ పేట లో శనివారం తెలుగుదేశం నాయకులతో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, స్వతంత్ర హాస్పటల్ నుండి గోరక్షణ పేట మీదుగా షెల్టాన్ వరకు మురుగునీరు అండర్ గ్రౌండ్ పైపులైన్ ఉందని , అయితే వాహనాల రాకపోకలకు పైపులైను దెబ్బతిందన్నారు. కొత్త పైప్లైన్ వేసేందుకు టెండర్లు పిలిచి కాంట్రాక్టు ఇచ్చామని, రోడ్డు నిర్మాణం ప్రక్రియలో సి సి రోడ్డు ,బిటి రోడ్డు ఏది వెయ్యాలా అని పలు సాంకేతిక అంశాలను సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లు పరిశీలిస్తున్నారని అన్నారు. ఈ లోగానే గత ఐదు సంవత్సరాలు నగర అభివృద్ధిని గాలికి వదిలేసిన వైసిపి నాయకులు గోరక్షణ పేట రోడ్డు నిర్మించాలని నిరసన వ్యక్తం చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. గత 18 నెలల కాలంలో ప్రతి వార్డులోనూ సుమారు నాలుగైదు కోట్ల వరకు అభివృద్ధి పనులు జరిగాయని గుర్తు చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు నగరం ఆరోగ్య, క్రీడా, పర్యాటక రంగాల్లో హబ్ గా మారుతుందన్నారు. రాజమండ్రి ఎంపీ పురందరేశ్వరి రూ.13 .50 కోట్ల రూపాయలతో మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం ఏర్పాటు కానున్నదని తెలిపారు. నగరంలో సీసీ రోడ్లు 14 కోట్ల తో సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణం జరుగుతున్నాయన్నారు. గత 5 ఏళ్ళలోనూ వైసీపీ నాయకులు సిఎస్ఆర్ నిధులు తెచ్చిన పాపాన పోలేదని, అభివృద్ధి పనులు చేపట్టలేదని విమర్శించారు. ఈ 18 నెలల్లోనూ ఎమ్మెల్యే ఆదిరెడ్డి కోట్ల రూపాయలు సి ఎస్ ఆర్ నిధులు తెచ్చి పాఠశాలల అభివృద్ధి కి ,సామాజిక అభివృద్ధికి పాటుపడుతున్నారని అన్నారు. అయినప్పటికీ పార్టీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు ను లక్ష్యంగా చేసుకొని మాజీ ఎంపీ భరత్ ప్రజలను తప్పుదోవ పట్టించే విధంగా లేనిపోని విమర్శలు చేస్తున్నారని ఆన్నారు. మాజీ కార్పొరేటర్ వర్రీ శ్రీనివాసరావు మాట్లాడుతూ, గత15 ఏళ్ల క్రితం ఎన్ఆర్సిపి నిధులు కింద అండర్ గ్రౌండ్ మురుగు నీరు పైప్లైన్ వేశారని, శిదిలావస్థకు చేరిందని దాని స్థానంలో కొత్త పైపులైను వేస్తున్నామన్నారు.

సేవ్ రాజమండ్రి కాదు .. సేవ్ వైసీపీ
కేడర్ పై దృష్టి పెట్టుకోవాలి..

సేవ్ రాజమండ్రి అని నినాదంతో ప్రజల ముందుకు వస్తానంటున్న మాజీ ఎంపీ భరత్ ముందుగా వైసీపీ క్యాడర్ పై దృష్టి పెట్టుకోవాలని రాంబాబు అన్నారు. తమ పార్టీ నగరంలోని 42 వార్డులోను బలంగా ఉందని, అయితే వైసీపీ పార్టీ మళ్లీ అధికారం రావడం కష్టమని భావించిన ఆ పార్టీ క్యాడర్ ఇతర పార్టీల వైపు చూస్తున్నా సంగతిని గ్రహించాలన్నారు.
వైసిపి పార్టీ గాలిలోనే 2019లోను, ,2024 ఎన్నికల్లోను ఆదిరెడ్డి కుటుంబం మెజారిటీ సాధించిన సంగతిని మాజీ ఎంపీ భరత్ గుర్తుంచుకోవాలన్నారు. గత జగన్ ప్రభుత్వం హాయంలో నగరంలో కమిషన్ల కోసం అభివృద్ధి పనులు చేశారని, అవన్నీ ఎంత నాణ్యమో దేవిచౌకు, పుష్కర ఘాట్లు వద్ద చేసిన పనులే నిదర్శనమన్నారు. ఈ సమావేశంలో తెలుగుదేశం నాయకులు కోసూరు చండీప్రియ, కిలపర్తి శ్రీనివాసు, పోరా పార్వతి సుందరి, కప్పల వెలుగు కుమారి మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుండి శ్రీ వరాహ లక్ష్మీ నృసింహ స్వామి చందన యాత్ర మహోత్సవాలు

- 28న చందన యాత్ర నిజరూప దర్శనం



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జనవరి 24:**శ్రీ మధుభయ వేదాంతచార్య పీఠం ట్రస్ట్ శ్రీరంగం ఆధ్వర్యంలో గత 24 సంవత్సరాలుగా విజయవంతంగా జరుగుతున్న శ్రీ వరాహ లక్ష్మీ నృసింహ స్వామి చందన యాత్ర మహోత్సవాలు ఆదివారం నుంచి ఘనంగా ప్రారంభం కానున్నాయి. స్థానిక సింహాచల నగర్ లోని స్వామివారి క్షేత్రంలో శనివారం ఆలయ ధర్మకర్త మండలి సభ్యులతో కలసి, ప్రధాన అర్చక స్వామి కిరణ్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ,
ఆదివారం సాయంత్రం ఉత్సవ ప్రార్థన, విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం రక్ష స్తోత్రం, అంకుర అంకురారోపణ ఆంకరారోపణ, వైనతీయ ప్రతిష్ట జరుగుతుందన్నారు. 26వ తేదీ సోమవారం ఉదయం 8 గంటల నుంచి వాహన ద్వజారోహన, యాగశాల ప్రవేశం, చతూస్థాన అర్చనలు, నిత్య హోమాలు, నిత్య పూర్ణహతి, సాయంత్రం నాలుగు గంటలకు తిరువీధి( గరుడ సేవ) ఉత్సవం జరుగుతుందన్నారు. 27 మంగళవారం ఉదయం 8 గంటలకు నిశాచూర్ణోత్సవం పసుపు కొట్టుట, నవ కలశసన్నపనం, సాయంత్రం 6 గంటలకు తిరుకల్యాణ మహోత్సవం జరుగుతుందన్నారు. ఆచార్ల ప్రధానంగా ప్రధానంగా ముఖ్యమైనది బుధవారం మూడు తెల్లవారుజామున 3:00కు సుప్రభాతం, ఆరాధన ,చందనోతరణ, సువర్ణ పుష్పార్చన, ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిజరూప దర్శన సేవ, రాత్రి 8 గంటలకు అష్టోత్తర జత కలశ అభిషేకం రాత్రి 9 గంటలకు చందన సమర్పణ , తీర్థ గోష్టి ఉంటుందన్నారు. 29వ తేదీ గురువారం 8 గంటలకు ఆరాధన, హోమాలు, నిశ్చరూప దర్శనము , ఉదయం 11 గంటలకు శ్రీ చక్రసానం జరుగుతాయన్నారు. 30వ తేదీ శుక్రవారం 30వ తేదీ శుక్రవారం భక్తులకు శ్రీవారి ప్రసాదం, అన్న సమారాధన, సాయంత్రం 6 గంటలకు శ్రీ పుష్పయాగం ద్వాదశరాధనలు, మహాపూర్ణవతి జరుగుతాయన్నారు. స్వామివారి మహోత్సవాలకు నగరంలోని భక్తులు వేలాదిగా హాజరై స్వామివారి అనుగ్రహం పొందాలని, తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు. ఈ సమావేశంలో కె,సింహాచలం, కె నాగేశ్వరరావు, అనంత ఆచార్య స్వామి, ముప్పిరాల అనంత స్వామి తదితరులు పాల్గొన్నారు.

# మొక్కుబడిగా పశు ఆరోగ్య శిబిరాలు

**సీతానగరం, పెన్ పవర్, జనవరి 24:**రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పశుఆరోగ్య శిబిరాలు సీతానగరం మండలంలోని మొక్కు
బడిగా నిర్వహిస్తున్నారు. ఈనెల ,19నుండి 31వ తేది వరకు రోజుకు రెండు గ్రామల్లో ఈ శిబిరాలు నిర్వహించవలసి ఉంది ప్రతి శిబిరంలో పశు వైద్య అధికారి సహాయకులు తప్పని సరిగా హజరై పశువులకు లేగ దూడలకు, గొర్రెలు మేకలకు నట్టల నివారణ మందులు అందించవలసి ఉంది కోళ్లకు టీకాలు వేయాలి అనారోగ్యంతో ఉన్న ఎదుగురాని గర్భ కోశ వ్యాధులకు గల పశువులకు ఉచితంగా చికిత్సలు నిర్వహించాలి పాడి రైతులకు పశువు భీమా పథకం గురించి లింగ నిర్ధారిత వీర్యం గురించి అవగాహన కల్పించవలసి ఉంది. అయితే గ్రామల్లో పశు ఆరోగ్య శిబిరాల గురించి రైతులకు కనీస సమాచారం కూడా ఉండటం లేదు. ఏ రోజు ఏ గ్రామంలో పశువైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నారో ముందుగా ఆ గ్రామంలో దండోరా వేసి రైతులకు సమాచారం అందించాలి. ఇవేమీ లేకుండా ఉదయం వెళ్లవలసిన సిబ్బంది మధ్యాహ్నం 11 గంటలకు తాపీగా చేరుకొని అక్కడున్న నాలుగు పశువులకు వైద్యం చేసి ఫోటోలు సంబంధిత శాఖకు అప్లోడ్ చేస్తున్నారు. తూతూ మంత్రంగా నిర్వహిస్తున్న ఈ ఆరోగ్య శిబిరాల వల్ల పాడి రైతులకు ఎటువంటి ఉపయోగం లేదని పలువురు అంటున్నారు. ప్రతి రైతు సేవ కేంద్రంలో పశు వైద్య సహాయకులు ఉంటున్నా రైతులకు ఏమి ఉపయోగం లేదంటున్నారు. ఇప్పటికైనా బాధ్యతాయుతంగా పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహించాలని పాడి రైతులు పలువురు కోరుతున్నారు.

# గంటన్నర లోనే తప్పిపోయిన బాలికను కనిపెట్టిన 3 టౌన్ పోలీసులు



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జనవరి 24:**స్థానిక కోరుకొండ రోడ్డు, గౌతమీ నేత్రాలయం హాస్పటల్ పక్క వీధి,
ఆర్ వి నగర్ కు చెందిన 14 సంవత్సరాల మైనర్ బాలిక కోరుపల్లి సిరివెన్నెల కనిపించడం లేదని ఆమె తల్లి తండ్రులు కే శ్రీనివాసరావు, శ్వేతాదేవీలు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. పైన తెలిపిన అమ్మాయి సువిశేషపురం ప్రతిభ స్కూల్లో 8వ తరగతి చదువుతున్నట్లు, ఆమెను ఇంట్లో వారు 22 తేది సాయంత్రం మందలించడంతో, ఆమె . 23.ఉదయం సుమారు 5:00 నుండి 5:30 గంటల మధ్యలో ఇంట్లో నుండి ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయిందన్నారు. ఆమె తాతయ్య కాటమరెడ్డి కళ్యాణ చక్రవర్తి 112 కి 5:31 గంటలకు కాల్ చేయగా త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ వి .అప్పారావు , సబ్ ఇన్స్పెక్టర్ ఎం.వి.రేవతి, కానిస్టేబుల్ విజయ్ కుమార్, టి. శ్రీనివాసరావు లు కలసి గాలింపు చర్యలు చేపట్టారు. ఆ అమ్మాయి కనబడకపోవడం గురించి సీసీ కెమెరాలు, ఆమె వెంట తీసుకువెళ్లిన మొబైల్ ఫోన్ ట్రాకింగ్ ఆధారంగా బాలిక తొర్రేడు వద్ద పట్టుకొన్నారు . ఆమె ను విచారించగా తరచూ ఎక్కువగా ఫోన్ చూస్తుందని తన ఇంటిలోని వారు మందలించడం తో చనిపోదామని ఇంటి నుండి వెళ్లిపోయినట్లు తెలిపినది. ఆ అమ్మాయిని పోలీస్ స్టేషన్ కి తీసుకువచ్చి అమ్మాయికి వాళ్ళ తల్లి తండ్రులకి కౌన్సెలింగ్ చేసి అమ్మాయిని వారి తల్లిదండ్రులకు అప్పగించామని
ఇన్స్పెక్టర్ వి ఏ రావు తెలిపారు.

# ఆంధ్ర లాయర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు గా సీనియర్ న్యాయవాది ఉన్నవ నాగరాజు నియమకం




**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జనవరి 24**

న్యాయవాదులు భద్రత - భవిష్యత్ కోసం అవిశ్రాంతంగా శ్రమిస్తున్న ఆంధ్ర లాయర్స్ అసోసియేషన్ "ఆలా" సంస్థకు సీనియర్ న్యాయవాది ఏపి హై కోర్టు స్టేండింగ్ కౌన్సిల్ (ఎండోమెంట్స్) ఉన్నవ నాగరాజు నియామకం జరిగింది. ఆలా " ఆలా అధ్యక్షులు రాజారామ్ ఎమ్. వి. ఆదేశాల మేరకు "ఆలా" ప్రధాన కార్యదర్శి మేడా శ్రీనివాస్ నియమించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ, రాజారామ్ గెలుపునకు న్యాయవాదులు కృషి చేసి న్యాయవాదుల భద్రతకు , భవిష్యత్ కు అండగా నిలవాలన్నారు. ఆంధ్రప్రదేశ్ ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్ కు జరుగు తున్న ఎన్నికల్లో వరస సంఖ్య 73 కు మొదటి ప్రాధాన్యత ఓటును వేసి అత్యధిక మెజార్టీతో రాజారామ్ ను గెలిపించాలని నాగరాజు కోరారు.
ఈ మేరకు "ఆలా" ఉపాధ్యక్షులు గా నియమితులైన ఉన్నవ నాగరాజు కి ఆంధ్ర లాయర్స్ అసోసియేషన్ (ఆలా) సభ్యులు అభినందనలు తెలిపారు .

# పరిసరాల పరిశుభ్రతే మన ఆరోగ్యం...ఎంపీడీవో వి చంద్రశేఖర్



**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. జనవరి 24.**
పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ప్రజలంతా ఆరోగ్య జీవనం సాగించవచ్చని తాడేపల్లిగూడెం ఎంపీడీవో వి చంద్రశేఖర్ పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం మండలం పెదతాడేపల్లిలో స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర థీమ్ జీరో గ్యాప్ శానిటేషన్ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా మూడో శనివారం గ్రామంలో పరిసరాల పరిశుభ్రత పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బహిరంగ మలమూత్ర విసర్జన మనేధం మరుగుదొడ్లను వాడదామని నినాదంతో గ్రామంలో పెద్దలు సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఎంపీడీవో వి చంద్రశేఖర్ గ్రామంలోని సామూహిక మరుగుదొడ్లను పరిశీలించి అక్కడ మరుగుదొడ్లు వాడుతున్న వారి వివరాలు సేకరించి అవసరమైతే వ్యక్తిగత మరుగుదొడ్లు అందించాలని సిబ్బందికి సూచించారు. అదేవిధంగా ఇంటింటికి వెళ్లి కొన్ని మరుగుదొడ్ల పరిస్థితిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎస్ రఘునాథ రాజు, ఎం ఆర్ సి ఎం రవి కిరణ్, సచివాలయ సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

# ఏపీ నిట్ లో ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం





- ప్రతి విద్యార్థి ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నదే విద్యాసంస్థ లక్ష్యం
- ఏపీ నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ దినేష్ శంకర్ రెడ్డి

**తాడేపల్లిగూడెం, పెన్ పవర్. జనవరి 24.**
ప్రతి విద్యార్థి ఉన్నత స్థాయికి చేరుకోవాలనే లక్ష్యంతోనే గురువులు విద్య నేర్పుతారని ఏపీ నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్ శంకర్ రెడ్డి సూచించారు. నేషనల్. ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఆంధ్రప్రదేశ్ (ఏపీ నిట్)లో 2015-2019, 2016-2020 బ్యాచ్ ల్లో నాలుగేళ్ల ఇంజినీరింగ్ కోర్సును పూర్తిచేసుకున్న బీటెక్ పూర్వ విద్యార్థుల తొలి ఆత్మీయ సమ్మేళనాన్ని సంస్థ ప్రాంగణంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఏపీ నిట్ డీన్ స్టూడెంట్స్ కెరీర్, అలుమ్ని ఇంటర్నేషనల్ రిలేషన్స్ డాక్టర్ జీబి వీరేష్ కుమార్ ఆద్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ దినేష్ శంకర్ రెడ్డి మాట్లాడుతూ జీవితంలో ఎంత ఎత్తుకు ఎదిగినా జన్మనిచ్చిన తల్లిదండ్రులతో పాటు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఎప్పటికి మరిచిపోకూడదని తెలిపారు.
పూర్వ విద్యార్థులు, విద్యా సంస్థ మధ్య బలమైన అనుబంధానికి, పునాదికి ఇటువంటి ఆత్మీయ వేడుకలే నిదర్శనమని, భవిష్యత్తులో కూడా ఇదే ఒరవడిని కొనసాగిస్తామని చెప్పారు. పూర్వ విద్యార్థులు పరిశోధన, విద్యా సంబంధమైన విషయాల్లో తమతో కలిసి పనిచేస్తూ విద్యాసంస్థ ప్రగతికి, పురోభివృద్ధికి దోహదపడాలని వివరించారు.
ఏపీ నిట్ డీన్ స్టూడెంట్స్ కెరీర్, అలుమ్ని ఇంటర్నేషనల్ రిలేషన్స్ డాక్టర్ జీబి వీరేష్ కుమార్ మాట్లాడుతూ తమ పూర్వ విద్యార్థులను కలిసినందుకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. పూర్వ విద్యార్థులు వివిధ హోదాల్లో రాణించడంతో పాటు మరిన్ని విజయాలు సాధించి మంచి పేరు ప్రఖ్యాతలు తెచ్చుకోవాలని వివరించారు. పలువురు పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ ఏపీ నిట్ విద్యా సంస్థలో చదువుకోవటమే తమ జీవితాలకు కీలక మలుపు అని, ఇక్కడ పొందిన విద్య, క్రమశిక్షణ, విలువలే తమను వివిధ రంగాల్లో నిలబెట్టాయని చెప్పారు. తమ ఉన్నతకి ఎంతగానో దోహదపడిన విద్యాలయానికి తమ వంతు సహకారాన్ని ఎల్లప్పుడూ అందిస్తామని ప్రకటించారు. అక్షర జ్ఞానాన్ని నేర్పించి, మంచి, చెడు చెప్పి, జీవితానికో దారి చూపించిన గురువులను సన్మానించుకునే అవకాశం దక్కటం తమ అదృష్టంగా భావిస్తున్నామని వివరించారు. అనంతరం విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి అసోసియేట్ డీన్, ఆచార్యులు డాక్టర్ సుదర్శన్ ధ్రువ సహ సమన్వయకర్తగా వ్యవహరించారు. ఆరేళ్ళ తరువాత విద్యా సంస్థలోకి అడుగుపెట్టిన మిత్రులందరూ ఒకరినొకరు ఎంతో ఆప్యాయతగా పలకరించుకున్నారు. ఒకరికొకరు తమ యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఆనాటి మధుర జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువుల ఆత్మీయ సాన్నిహిత్యాన్ని నెమరవేసుకున్నారు. అప్పటి మధుర క్షణాలను, స్మృతులను తలుచుకుని భావోద్వేగానికి గురయ్యారు. పూర్వ విద్యార్థులు గురువులతో స్వీయచిత్రాలు తీసుకుని ఆయా మధురస్మృతులను తమ తమ చరవాణిలలో భద్రపరచుకోవటం విశేషం. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సాయంత్రం నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఎంతగానో అలరించాయి. ఈ కార్యక్రమంలో డీన్లు డాక్టర్ జి.రవికిరణ్ శాస్త్రి, డాక్టర్ వి.సందీప్, డాక్టర్ ఎన్.జయరామ్, డాక్టర్ కార్తీక్ శేషాద్రి, డాక్టర్ హిమబిందు, పలువురు విభాగాధిపతులు, ఆచార్యులు పాల్గొన్నారు.



# తాడేపల్లిగూడెం రూరల్ వైసీపీ నాయకులతో నియోజకవర్గ ఇంచార్జి వడ్డి రఘురామ్ భేటీ.





- రూరల్ మండలంలోని సమస్యలపై చర్చ.

**తాడేపల్లిగూడెం, పెన్ పవర్. జనవరి 24:**పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం రూరల్ మండలం అప్పారావుపేట తదితర గ్రామాల నుండి వైఎస్ఆర్సీపీ నాయకులు కార్యకర్తలు తాడేపల్లిగూడెం నియోజకవర్గం వైఎస్ఆర్సీపీ ఇంచార్జ్ వడ్డి రఘురామ్ నాయుడుని మర్యాద పూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా మండలంలోని పలు సమస్యలపై చర్చించారు. పార్టీని బలోపేతం చేసే విధంగా చేయవలసిన కార్యాచరణ తదితర అంశాలపై చర్చించారు. ఈ నెలలో జరగబోయే నియోజకవర్గ స్థాయి ఆత్మీయ సమావేశంకు సంబంధించి అంశాలపై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ కొప్పుల వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ గొర్రెల శ్రీనివాస్, ఎంపీటీసీ మార్లపూడి సుబ్బారావు, వైసీపీ నాయకులు రాపాక వెంకటేశ్వరావు, కాకర్ల శ్రీనివాస్, దూద్ లాలూ, రాఘవేంద్ర, అడపా వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.
ఉదయం నుండి నియోజకవర్గంలో ఉన్న నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో వడ్డీ రఘురామ్ కలవటం జరిగింది.
ఉంగుటూరు నియోజకర్గశీ
కంసాలి గుంట .బాబ్జీ
ఉంగుటూరు(టి.యు సి అధ్యక్షులు )
సింహాద్రి. సత్యనారాయణ (తిమ్మయపాలెంసర్పంచ్) తమ్మిన శ్రీనివాసు (ఎర్ర మెల్లిపాడు సర్పంచ్) గౌతు రాము(నల్లమడు సర్పంచ్) మిద్దె వెంకటేశ్వర రావు (ఎ.గోకవరం సర్పంచ్)మన తాడేపల్లిగూడెం నియోజకవర్గ వైఎస్ఆర్ సీపీ ఇంచార్జ్ వడ్డి రఘురాం నాయుడు ని మర్యాద పూర్వకంగా కలిసారు.



## ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసును కలిసిన బరియల్ గ్రౌండ్ కమిటీ సభ్యులు



**రాజమహేంద్రవరం , పెన్ పవర్, జనవరి 24**:మెయిన్ రోడ్డు బరియల్ గ్రౌండ్ నూతన కమిటీ సభ్యులు సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) ను మర్యాదపూర్వకంగా కలిశారు. తిలక్ రోడ్డులోని ఆయన కార్యాలయంలో నూతన కమిటీ అధ్యక్షులు యండి నసూరుల్లా భేగ్, వైస్ ప్రెసిడెంట్ ఎస్కె అబ్దుల్ కరీమ్, సెక్రటరీ, యండి నజీర్, ట్రెజరర్ యండి నయిముద్దీన్ ఖాన్, సభ్యులు యండి ఇలియాజ్ ఖాన్, అస్సరఫ్ ఆలి, ఎస్కె రహీమ్ కలవగా వారికి ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అభినందనలు తెలిపి శాలువాలు కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఏమైనా సౌకర్యాలు కల్పించాల్సి ఉన్నా తన దృష్టికి తీసుకురావాలన్నారు. సమన్వయంతో పని చేసి పార్టీకి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు ఖాన్ బాషా, మహబూబ్ ఖాన్, ఉస్సేన్, మున్నీర్, అల్లా బక్సు, మోహిన్ తదితరులు పాల్గొన్నారు.

## మునిసిపల్ అధ్వర్యంలో "స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర" కార్యక్రమం.

- కార్మికులు, ప్రజలతో ప్రతిజ్ఞ చేయించిన కమిషనర్ ఏసుబాబు.







**తాడేపల్లిగూడెం, పెన్ పవర్. జనవరి 24.**తాడేపల్లిగూడెం పురపాలక సంఘం లో మున్సిపల్ కమిషనర్ శ్రీ యేసు బాబు ఆధ్వర్యం లో ప్రతి నెలలో మూడవ శనివారం జరిగే "స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర" కార్యక్రమం లో భాగం గా తాడేపల్లిగూడెం పోలీస్ ఐ ల్యాండ్ నుండి రేలంగి చిత్ర మందిర్ వరకు బారి ఎత్తున ర్యాలీ నిర్వహించారు. బహిరంగ మల విసర్జన చేయకూడదని , పట్టణాన్ని పరిశుభ్రం గా ఉంచాలని ప్రజలకు అవగాహన కలిగించారు. స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కి సంబంధించి పోలీస్ ఐ ల్యాండ్ వద్ద మానవహారం గా నిలబడి , అందరితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమం లో మున్సిపల్ కమిషనర్ శ్రీ యేసు బాబు , మున్సిపల్ ఇంజినీర్ వెంకట రమణ , ఏసీపీ సీతారాం , ఎమ్ ఎచ్ రాజు, టిపిఓ జగదీష్ ,రెవెన్యూ ఇన్స్పెక్టర్ అశోక్ కుమార్ , శానిటరీ ఇన్స్పెక్టర్ సోమేశ్వర రావు, ఇతర మున్సిపల్ సిబ్బంది, 35 వార్డు ల నుండి సచివాలయ సిబ్బంది, సెల్ఫ్ హెల్పింగ్ గ్రూప్ సిబ్బంది, ఆర్పీ లు ఈ ర్యాలీ పాల్గొన్నారు.

## మాజీ సర్పంచ్ కి నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే తలారి



**తాళ్లపూడి, పెన్ పవర్, జనవరి 24:**మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షురాలు, మాజీ సర్పంచ్ పులిదుండి లూర్దుమేరీ ఆదరణ కూడికలో పాల్గొన్న కొవ్వూరు నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ శాసనసభ్యులు తలారి వెంకట్రావు. లూర్దు మేరీ తనయుడు నరేంద్ర బాబుని, కుటుంబ సభ్యులను పరామర్శించడం జరిగినది. ఈ కార్యక్రమంలో తాళ్లపూడి ఎంపీపీ జొన్నకూటి పోసిరాజు, నాయకులు యాళ్ళ బాబురావు, సాయిస్ఫూర్తి హాస్పిటల్ సీఈవో గూడా విజయరాజు, గజ్జరం సర్పంచ్ గండి రాంబాబు, ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిట్టా శ్రీనివాస్, మేణ్ణి శేషు, గణేష్, రత్నబాబు, జగన్, సూర్య ప్రకాష్ తదితరులు పాల్గొనడం జరిగినది.

## నారాయణపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డ్రోన్ పైలెట్ ట్రైనింగ్ సర్టిఫికెట్ ప్రోగ్రాం ముగింపు



**పెన్ పవర్ ఉంగుటూరు జనవరి 24:**పీఎం ఉష స్కీమ్‌లో భాగంగా ఏరియల్ డ్రోన్ ట్రైనింగ్ విజయవంతం విద్యార్థులకు ఉపాధి మార్గాలు తెరిచిన డ్రోన్ పైలెట్ & సాయిల్ టెస్టింగ్ వర్క్‌షాప్
వ్యవసాయ టెక్నాలజీ దిశగా కీలక అడుగు: నారాయణపురంలో డ్రోన్ ట్రైనింగ్
డిగ్రీ పూర్తికాకముందే నైపుణ్యం డ్రోన్ పైలెట్ కోర్సుతో విద్యార్థులకు అవకాశాలు
సబ్ హెడ్డింగ్ (ఉంటే):
ఏరీస్ ఆగ్రో కంపెనీ సహకారంతో ఐదు రోజుల సర్టిఫికెట్ ప్రోగ్రాం కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు ప్రశంసా పత్రాల పంపిణీ

## లక్షల విలువైన బంగారు ఆభరణం అప్పగింత





- ఇద్దరు హోం గార్డుల నిజాయితీకి జిల్లా ఎస్పీ అభినందన
- గణతంత్ర దినోత్సవ ఉత్తమ సేవా పురస్కారాలకు నామినేషన్

**క్రైమ్ బ్యూరో పెన్ పవర్ భీమవరం, జనవరి 24:** విధి నిర్వహణలో అప్రమత్తతతో పాటు వ్యక్తిగత జీవితంలో అత్యున్నత నైతిక విలువలను చాటుకున్న ఇద్దరు హోం గార్డులు పోలీసు శాఖ ప్రతిష్టను మరింత పెంచారని జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి అన్నారు. లక్షల రూపాయల విలువైన బంగారు ఆభరణాన్ని నిజాయితీగా యజమానురాలికి అప్పగించినందుకు గాను ఆ ఇద్దరిని శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో ప్రత్యేకంగా అభినందించారు.
యలమంచిలి పోలీస్ స్టేషన్‌లో హోం గార్డుగా విధులు నిర్వహిస్తున్న సిహెచ్. నాగేశ్వరరావు, నరసాపురం డీఎస్పీ కార్యాలయంలో హోం గార్డుగా పనిచేస్తున్న కె. సూర్య సాగర్ ఇద్దరూ పాలకొల్లు పట్టణ పరిధిలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న సమయంలో, వారి ముందుగా వెళ్తున్న ఒక మహిళ మెడలో నుంచి ప్రమాదవశాత్తు సుమారు రూ. 5 లక్షల విలువైన (నాలుగున్నర కాసుల) బంగారు గొలుసు జారిపడటాన్ని గమనించారు.
అంత విలువైన ఆభరణం చేతికి వచ్చినప్పటికీ ఎలాంటి ప్రలోభానికి లోనుకాకుండా తక్షణమే స్పందించిన వారు, ఆ మహిళను వెంబడించి వాహనాన్ని ఆపి విషయం తెలియజేశారు. అనంతరం ఆ బంగారు గొలుసును ఆమెకు సురక్షితంగా అప్పగించి తమ నిజాయితీని చాటుకున్నారు. చేజారిపోయిందనుకున్న ఆభరణం తిరిగి దక్కడంతో ఆ మహిళ ఆనందబాష్పాలతో హోం గార్డులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఘటనపై స్పందించిన జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి మాట్లాడుతూ, సమాజంలో పోలీసుల పట్ల నమ్మకం పెరిగేలా ఈ ఇద్దరు హోం గార్డులు ఆదర్శంగా నిలిచారని ప్రశంసించారు. వారి సేవలను గుర్తించి ప్రశంసా పత్రాలు అందజేయడమే కాకుండా, రాబోయే జనవరి 26 గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా జిల్లా స్థాయి ఉత్తమ సేవా ప్రశంసా పత్రాలకు వీరి పేర్లను నామినేట్ చేస్తున్నట్లు అధికారికంగా ప్రకటించారు.
ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్మ్డ్ రిజర్వ్ డీఎస్పీ ఎం.వి.వి. సత్యనారాయణ, నరసాపురం సబ్ డివిజన్ డీఎస్పీ జి. శ్రీ వేద, హోం గార్డ్ ఇన్‌చార్జ్ ఆర్ఎస్సై కె. గోపీ కృష్ణతో పాటు ఇతర పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## గంజాయి నిర్మూలనే లక్ష్యంగా ప్రజలు కృషి చేయాలి



- 12,570 కేజీల" గంజాయి ధ్వంసం
- తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ డి. నరసింహ కిషోర్

**రాజమహేంద్రవరం, పెన్ పవర్ జనవరి 24:**జిల్లాలో గంజాయి నిర్మూలనే లక్ష్యంగా ప్రజలు కృషి చేయాలని తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ డి. నరసింహ కిషోర్ పిలుపునిచ్చారు. జిల్లా వ్యాప్తంగా 201 కేసులలో 23 పోలీస్ స్టేషన్ లో పరిధిలో సీజ్ చేయబడిన సుమారు 12వేల 5వందల 70 కేజీల గంజాయిని జిల్లా డ్రగ్ డిస్పోజల్ కమిటీ ఆదేశానుసారం, ప్రొసీజర్ ప్రకారం శనివారం ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, తూర్పుగోదావరి జిల్లాలోని 23 పోలీస్ స్టేషన్ల పరిధిలో గత నాలుగు సంవత్సరాల నుండి నమోదైన 201 గంజాయి కేసులలో సీజ్ చేయబడిన "12,570 కేజీల" గంజాయిని జిల్లా డ్రగ్స్ డిస్పోజల్ చైర్మన్ డి. నరసింహా అడిషనల్ ఎస్పీ, డీఎస్పీ (నార్త్ జోన్) సభ్యులు పరిశీలించి, నిర్వీర్యానికి అనుకూలంగా ఉన్నట్లుగా నిర్ధారించారు. విశాఖపట్నం జిల్లా, భీమునిపట్నం మండలం, కాపుల ఉప్పాడ గ్రామం పరిధిలోని సర్వే నంబర్లు 410 , 415 లో ఉన్న జిందాల్ అర్బన్ వేస్ట్ మేనేజ్మెంట్ లిమిటెడ్ సంస్థలో ఆయన తెలిపారు. జిందాల్ ప్లాంట్ యాజమాన్యం సహకారంతో, నిబంధనలకు అనుగుణంగా అన్ని ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుని చట్టప్రకారం రెవెన్యూ అధికారులు మధ్యవర్తుల సమక్షంలో గంజాయిని నిర్వీర్యం చేయడం జరిగిందని జిల్లా ఎస్పీ తెలియజేశారు. జిల్లాలో ఇప్పటివరకు కొన్ని మాదకద్రవ్య దుర్వినియోగ హాట్‌స్పాట్‌లు గుర్తించామని, ఈ ప్రదేశాలలో కఠినమైన నిఘా ఏర్పాటు చేశామన్నారు. నగర శివారులోని నిరుపయోగంగా, పాడు పడిన స్థితిలో ఉన్న భవనాలను, నిర్మాణాలను కూల్చివేయాలని మున్సిపల్ అధికారులను కోరడం జరిగిందన్నారు , లైటింగ్ లేని ప్రదేశాల్లో లైటింగ్ ఏర్పాటు చేయాలని, కొన్ని సున్నిత ప్రాంతాల్లో సి సి కెమెరాలు కూడా ఏర్పాటు చేయవలసినదిగా సంబంధిత ఎస్.హెచ్.ఓ లకు సూచించామన్నారు.జిల్లాలో గంజాయిని సమూలంగా నిర్మూలించేందుకు అన్ని రకాల పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు తెలియజేశారు. గంజాయి అలవాటు పడిన 17 మంది నేరస్తులపై పి ఐ టి ఎన్ డి పీ ఎస్ చట్టం అమలుకు అనుమతులు రాగా, 14 మందిని జైలుకు పంపించడం జరిగిందన్నారు.
జిల్లాలోని అన్ని విద్యా సంస్థలలో యాంటీ డ్రగ్స్ పై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.
బహిరంగ ప్రదేశాలు, ఐసోలేషన్ ప్రదేశాలు , ఇతర ప్రాంతాలలో డ్రోన్ నిఘా ఏర్పాటు చేశామని తెలియజేశారు.
జిల్లా వ్యాప్తంగా 5 సబ్ డివిజన్ల పరిధిలో గంజాయి నిర్మూలనకు, ఒక్కో సబ్ డివిజనకు ఒక ఎస్సై , నలుగురు సిబ్బంది "తో ఐదు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, గంజాయి నిర్మూలనకు పటిష్ట చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. జిల్లాలో ఎక్కడ గంజాయి ఆనవాళ్లు కనిపించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్ కు గాని లేదా డయల్ 112 గాని సమాచారం అందివ్వాలని విజ్ఞప్తి చేశారు.
ఈ డ్రగ్ డిస్పోజల్ కార్యక్రమానికి తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ తో పాటుగా జిల్లా డ్రగ్ డిస్పోజల్ కమిటీ సభ్యులు డి.ఎస్.పి (నార్త్ జోన్) వై. శ్రీకాంత్, ఇతర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## ఆదివాసి ఇంటి నిర్మాణానికి జేకే సిటీ ట్రస్ట్ సహకారం




**చింతూరు, పెన్ పవర్ జనవరి 24:**రామన్నపాలెం గ్రామానికి చెందిన ఒక నిరుపేద ఆదివాసి గిరిజన కుటుంబానికి ఇంటి నిర్మాణానికి అవసరమైన సామాగ్రిని జేకే సిటీ ట్రస్ట్ చైర్మన్, ప్రముఖ ఆయుర్వేద వైద్యులు జమాల్ ఖాన్ శనివారం అందజేశారు.గ్రామానికి చెందిన సోడే వీరయ్య ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఇల్లు నిర్మించుకోలేకపోవడంతో, తనకు సహాయం చేయాలని జేకే సిటీ ట్రస్ట్ చైర్మన్‌ను అభ్యర్థించారు. దీనికి స్పందించిన జమాల్ ఖాన్ వెంటనే ఇంటి నిర్మాణానికి అవసరమైన పైపులు, సిమెంట్, రేకులు తదితర సామాగ్రిని అందజేసి మానవతా దృక్పథాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో జేకే సిటీ ట్రస్ట్ సభ్యులు జాన్ సుందర్, అజీజ్, వినోద్ పాల్గొనగా, టిడిపి నాయకులు శీలం తమ్మయ్య, వ్యవసాయ మార్కెట్ కమిటీ సభ్యుడు పసుపులేటి సాల్మన్ రాజు తదితరులు హాజరయ్యారు. ట్రస్ట్ చేపడుతున్న సేవా కార్యక్రమాలు ఆదివాసి ప్రాంతాల్లోని నిరుపేద కుటుంబాలకు ఎంతో ఊరటనిస్తున్నాయని గ్రామస్తులు కొనియాడారు.

## భూ సమస్యలు తక్షణమే పరిష్కరించాలి.-సువర్ణ రాజు.



**గోపాలపురం, పెన్ పవర్, జనవరి 23.**నియోజకవర్గంలో దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్చార్జ్ దొడ్డిగర్ల సువర్ణ రాజు , కొవ్వూరు రెవెన్యూ డివిజనల్ అధికారి రాణి సుస్మితను కోరారు. శనివారం కొవ్వూరులో ఆర్డీవో కార్యాలయంలో ఆమెను కలిసి పలు సమస్యలకు సంబంధించి వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త భూచట్టం కారణంగా దీర్ఘకాలికంగా ఉన్న ఉన్న భూ సమస్యలను సత్వరం పరిష్కరించవచ్చున్నారు. నియోజకవర్గంలోనే గోపాలపురం, నల్లజర్ల మండలాల్లోని పలు గ్రామాల్లో భూ సమస్యలు నెలకొని ఉన్నాయని అన్నారు. అలాగే కొన్ని గ్రామాలలో స్మశాన వాటికలు సైతం ఆక్రమణలకు గురయ్యాయని అన్నారు. అటువంటి సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు మద్దాల కాశీ విశ్వనాథ్ సనారి, ప్రగడ రాంబాబు, కాకర్ల రామారావు, శేఖర్ ,కాళ్ళ రామారావు తదితరులు పాల్గొన్నారు.

02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పొ. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## నాయి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో బీహార్ మాజీ ముఖ్యమంత్రి శ్రీ కర్పూరి ఠాగుర్ గారి 102 వ జయంతి వేడుకలు.



**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. జనవరి 24.**ఈ రోజు తాడేపల్లిగూడెం లో నాయి బ్రాహ్మణ సేవా సంఘం ఆచంట తిరుమల రావు ఆధ్వర్యంలో బీహార్ మాజీ ముఖ్యమంత్రి శ్రీ కర్పూరి ఠాగుర్ గారి 102 వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి ఈ కార్యక్రమంలో పాల్గొన్న బి సి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వర్తనపల్లి కాశీ , తాడేపల్లిగూడెం నియోజకవర్గం అధ్యక్షుడు కేశవభట్ల విజయ్, యువజన అధ్యక్షుడు అత్తిలి బాబి , ప్రధాన కార్యదర్శి తుమరడ చిన్న, పెంటపాడు మండలం అధ్యక్షులు మల్లేశ్వరరావు, నాగు, ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు విజయ్ కుమార్, శివ, వాయిద్య కళాకారులు సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వరరావు,, పసుమర్తి శ్రీనివాస్ , మహాలక్ష్మి , పి యమ్ పి జిల్లా అధ్యక్షుడు రాము , మరియు బి సి నాయకులు పాల్గొన్నారు

## గంటన్నర లోనే తప్పిపోయిన బాలికను కనిపెట్టిన 3 టౌన్ పోలీసులు



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జనవరి 24 :**స్థానిక కోరుకొండ రోడ్డు, గౌతమీ నేత్రాలయం హాస్పటల్ పక్క వీధి,
ఆర్ వి నగర్ కు చెందిన 14 సంవత్సరాల మైనర్ బాలిక కోరుపల్లి సిరివెన్నెల కనిపించడం లేదని ఆమె తల్లి తండ్రులు కే శ్రీనివాసరావు, శ్వేతాదేవీలు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. పైన తెలిపిన అమ్మాయి సువిశేషపురం ప్రతిభ స్కూల్లో 8వ తరగతి చదువుతున్నట్లు, ఆమెను ఇంట్లో వారు 22 తేది సాయంత్రం మందలించడంతో, ఆమె . 23.ఉదయం సుమారు 5:00 నుండి 5:30 గంటల మధ్యలో ఇంట్లో నుండి ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయిందన్నారు. ఆమె తాతయ్య కాటమరెడ్డి కళ్యాణ చక్రవర్తి 112 కి 5:31 గంటలకు కాల్ చేయగా త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ వి .అప్పారావు , సబ్ ఇన్స్పెక్టర్ ఎం.వి.రేవతి, కానిస్టేబుల్ విజయ్ కుమార్, టి. శ్రీనివాసరావు లు కలసి గాలింపు చర్యలు చేపట్టారు. ఆ అమ్మాయి కనబడకపోవడం గురించి సీసీ కెమెరాలు, ఆమె వెంట తీసుకువెళ్లిన మొబైల్ ఫోన్ ట్రాకింగ్ ఆధారంగా బాలిక తొర్రేడు వద్ద పట్టుకొన్నారు . ఆమె ను విచారించగా తరచూ ఎక్కువగా ఫోన్ చూస్తుందని తన ఇంటిలోని వారు మందలించడం తో చనిపోదామని ఇంటి నుండి వెళ్లిపోయినట్లు తెలిపినది. ఆ అమ్మాయిని పోలీస్ స్టేషన్ కి తీసుకువచ్చి అమ్మాయికి వాళ్ళ తల్లి తండ్రులకి కౌన్సెలింగ్ చేసి అమ్మాయిని వారి తల్లిదండ్రులకు అప్పగించామని
ఇన్స్పెక్టర్ వి ఏ రావు తెలిపారు.

# ఆరోగ్యాభివృద్ధి ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా కూటమి ప్రభుత్వం

- పరిశుభ్రత--పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత
- స్వచ్ఛ రథాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి



**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్,జనవరి 24:**పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణతోనే ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ సాధ్యమని రంపచోడవరం ఎమ్మెల్యే, రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్?పర్సన్ మిరియాల శిరీషాదేవి జాయింట్ కలెక్టర్ స్మరణ రాజ్ పేర్కొన్నారు. శనివారం రంపచోడవరం అంబేద్కర్ కూడలిలో "స్వర్ణాంధ్ర -- స్వచ్ఛ ఆంధ్ర" కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే శిరీషాదేవి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆమె పిలుపునిచ్చారు. శుభ్రమైన గ్రామాలే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ప్రత్యేక విధానాలతో ముందుకు సాగుతోందన్నారు. పారిశుధ్య పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ, వ్యర్థాల నిర్వహణపై ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చి సామాజిక అభివృద్ధిని సాధించాలన్నారు. ప్రభుత్వ యంత్రాంగంతో పాటు ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని స్పష్టం చేశారు. ప్రతి నెల మూడో శనివారం "స్వర్ణాంధ్ర -- స్వచ్ఛ ఆంధ్ర" కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా మురికి కాలువలు, వీధులు శుభ్రం చేయడం, చెత్త నిర్మూలనపై అవగాహన కల్పించడంతో పాటు గృహాల నుంచి వ్యర్థాల సేకరణకు పంచాయతీల్లో వాహనాలు కేటాయించినట్లు తెలిపారు. స్వచ్ఛ రథం ప్రారంభం

ఈ సందర్భంగా రంపచోడవరం కేంద్రంగా వినూత్నంగా రూపొందించిన స్వచ్ఛ రథాన్ని ఎమ్మెల్యే జాయింట్ కలెక్టర్ ప్రారంభించారు. గృహాల్లో నిరుపయోగంగా ఉన్న ప్లాస్టిక్, పాత ఇనుము, పేపర్లు తదితర వ్యర్థాలను వస్తు మార్పిడి విధానం ద్వారా సేకరించి, వాటి బరువుకు తగిన నగదు లేదా నిత్యావసర సరుకులు (కందిపప్పు, గోధుమపిండి, నూనె, సోపులు) అందజేస్తామని తెలిపారు. "ఇంటి వద్దకే సేవ" కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛ రథం రోజుకు రెండు గ్రామాల చొప్పున పర్యటించి నేరుగా గృహాల వద్దే వ్యర్థాలను సేకరిస్తుందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మురుగు కాలువల్లో ప్లాస్టిక్ వేయకుండా పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు. అనంతరం "స్వర్ణాంధ్ర -- స్వచ్ఛ ఆంధ్ర" కార్యక్రమంపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు గొర్లె సునీత, రాష్ట్ర దూదేకుల కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ సుభాని, మండల పార్టీ అధ్యక్షులు పెంటపాటి అనంత మోహన్, ఏఎంసి వైస్ చైర్మన్ సలాది బాపిరాజు, అరకు పార్లమెంట్ ఉపాధ్యక్షులు అడబాల బాపిరాజు, నియోజకవర్గ ఎస్టీ విభాగం అధ్యక్షులు పండా చెల్లన్న దొర, జనసేన ప్రతినిధి పాపోలు శ్రీనివాసరావు, రంపచోడవరం సర్పంచ్ మంగా బొజ్జయ్యతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## గిరిజన రైతుల ఆర్థికాభివృద్ధికి కూటమి సర్కార్ కృషి

- వన్ ధన్ వికాస్ కేంద్రాల ద్వారా జాఫ్రా నూర్పిడి యంత్రాల పంపిణీ
- ప్రభుత్వ రాయితీలను సద్వినియోగం చేసుకోవాలి : ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి



**గంగవరం /మారేడుమిల్లి, పెన్ పవర్, జనవరి 24:**

గిరిజన రైతుల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని రంపచోడవరం ఎమ్మెల్యే, రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్ పర్సన్ మిరియాల శిరీషాదేవి తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న రుణాలు, రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. శనివారం మారేడుమిల్లి వెలుగు కార్యాలయంలో ఏపిఎం కిషోర్ బాబు అధ్యక్షతన జాఫ్రా రైతులకు నూర్పిడి యంత్రాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే శిరీషాదేవికి వెలుగు కార్యాలయ సిబ్బంది ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వన్ ధన్ వికాస్ కేంద్రాల గిరిజన రైతులకు అనేక ప్రయోజనాలు లభిస్తున్నాయని పేర్కొన్నారు. గిరిజన మహిళా రైతులకు ఉపయోగపడే విధంగా జాఫ్రా పంట గింజలు వేరు చేసే నూర్పిడి యంత్రాలను వి డి వి కె నిధుల ద్వారా రూ. 5.35 లక్షల వ్యయంతో రెండు యంత్రాలు కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఈ యంత్రాలను మారేడుమిల్లి మండలంలోని కుట్రవాడ, గుజ్జుమామిడి వలస పంచాయతీలకు కేటాయించినట్లు వివరించారు. ఈ యంత్రాల ద్వారా జాఫ్రా పంటతో పాటు వరి, మొక్కజొన్న, మినుములు, పెసలు వంటి పంటలను కూడా నూర్పిడి చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా గ్రామస్థాయిలోనే వ్యాపారం చేసుకునేలా రైతులు ముందుకు రావాలని సూచించారు. ఈ రెండు పంచాయతీలలో సుమారు 600 మంది గిరిజన మహిళా రైతులకు ఈ యంత్రాల ద్వారా లబ్ధి చేకూరుతుందని చెప్పారు.

అంగన్వాడీ కేంద్రాలకు ప్రీ స్కూల్ కిట్ల పంపిణీ

పూర్వ ప్రాథమిక విద్యలో ఐసిడిఎస్ సేవల పాత్ర అత్యంత కీలకమని ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి అన్నారు. మారేడుమిల్లి సిడిపిఓ. శాంత కుమారి ఆధ్వర్యంలో అంగన్వాడీ చిన్నారులకు ప్రీ స్కూల్ కిట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ సేవలను మరింత మెరుగ్గా నిర్వహించాలని సూచించారు. అనంతరం చిన్నారులకు ఆట వస్తువులు, విద్యా సామగ్రితో కూడిన కిట్లను ఆమె అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర దూదేకుల కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ సుభాని, జడ్పీటీసీ గొర్లె బాలాజీ బాబు, ఎంపీపీ సార్ల లలిత కుమారి, మండల పార్టీ అధ్యక్షులు గురుకు శేషు కుమార్, జనసేన మండల పార్టీ అధ్యక్షులు దుర్గా ప్రసాద్, సర్పంచులు కొండా జాకబ్, సార్ల రమాదేవి, వీరవల్లి జార్జి బాబు, కారం లక్ష్మి, సీనియర్ నాయకులు భీశెట్టి అప్పాజీ, ఎంపీటీసీలు కొరగని సువర్ణ రాజు, సాధల గున్నమ్మ, భీశెట్టి సత్య, భీశెట్టి శివరాజు, మాజీ సర్పంచ్ సాధల సోమిరెడ్డి, మాజీ ఎంపీపీ లక్ష్మి, మండల పార్టీ ఉపాధ్యక్షులు కర్రి సన్యాసి రెడ్డి, ఐ టి డి ఏ ఏ ఓ రమణ, వెలుగు ఏపిడి దేగలయ్య, ఎంపీడీవో కిషోర్, ఏపీఎం కిషోర్, సూపర్‌వైజర్లు పి. చంద్రమ్మ, రవళి తదితరులు, అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

## అడ్డతీగల కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం..





**అడ్డతీగల పెన్ పవర్ జనవరి24:** స్థానిక అడ్డతీగల కమ్యూనిటీ హెల్త్ సెంటర్ లో స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం హాస్పిటల్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పండ. సతీష్ ఆధ్వర్యంలో జరిగింది.

ఈ కార్యక్రమంలో ముఖ్యంగా మొక్కలు నాటడం, చేతులు శుభ్రంగా కడుక్కోవడం అలాగే హాస్పిటల్ లో ఉన్న పరిసరాలలో పరిశుభ్రంగా ఎలా ఉంచుకోవాలో,స్వచ్ఛత కార్యక్రమాల కొరకు శ్రమదానం, పరిశుభ్రత గురించి నేను వేసిన ఈ ముందడుగు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని పరిశుభ్రపరచడంలో సహాయం చేస్తుందని నమ్ముతూ ఈరోజు ఈ కార్యక్రమం తలపెట్టడం జరిగింది అని, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సూచనలు అనుగుణంగా,హాస్పిటల్ కౌన్సిలర్ నారే. వాసు ప్రతిజ్ఞ చేయించారు. అలాగే నేను నా పరిసరాలను పరిశుభ్రత కొరకు ప్రతిరోజు కొంత సమయం కేటాయిస్తానని అవగాహన కల్పిస్తానని,మన ఆంధ్రప్రదేశ్ ను స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్ గా తీర్చిదిద్దేటట్లు నా వంతు కృషి చేస్తానని, హాస్పిటల్ స్టాఫ్ అందరు అలాగే వైద్యులు, పేషెంట్స్ కొంతమంది తో కలసి వాసు ప్రమాణంచేయించారు. అలాగే మొక్కలు నాటారు, వచ్చిన పేషెంట్స్ భోజనానికి ముందు చేతులు శుభ్రం చేసుకోవాలని, అలాగే ఇంటి దగ్గర మన దయానశీదిన కార్యక్రమం లో ఎల్లపుడు శుభ్రం గా ఉండడం వలన కొన్ని రోగాలు మనకు దరి చేరవు అని, కౌన్సిలర్ వాసు సూచించారు, అనంతరం మానవహారం నిర్వహించారు . ఈ కార్యక్రమం లో హాస్పిటల్ డాక్టర్స్ ప్రసన్న దేవి, రేష్మ సుల్తానా, ఊహ, దేవుడు, రవణ రెడ్డి, నర్సింగ్ స్టాఫ్, శానిటేషన్ స్టాఫ్ పాల్గొన్నారు..

## వెంకటరమణ చౌదరిని కలిసిన స్థానిక టిడిపి నేతలు



**గోపాలపురం,పెన్ పవర్ జనవరి 23:**తూర్పుగోదావరి జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బొడ్డు వెంకటరమణ చౌదరిని మండల టిడిపి నాయకులు శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. మండల పార్టీ అధ్యక్షులు కొర్లపాటి రాము,నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు కాకర్ల రామతులసిల ఆధ్వర్యంలో నాయకులు వెంకటరమణ చౌదరిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మండల నాయకులు మాట్లాడుతూ మండలాభివృద్ధికి పార్టీ పటిష్టతకు కృషిచేయాలని కోరారు. మండలంలో నెలకొన్న పలు సమస్యలని ఆయన దృష్టికి తీసుకెళ్లడంతో పాటు పార్టీ స్థితిగతులు, పరిస్థితులు తదితర విషయాల గురించి కొద్దిసేపు చర్చించారు. మండలానికి రావాలని పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ టిడిపి శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని నింపాలని కోరారు. ఈ కార్యక్రమంలో చెరుకుమిల్లి సొసైటీ అధ్యక్షులు గద్దె హరిబాబు,ఈలి శరత్ బాబు,మద్దిపాటి రమేష్ ,వేముల నాగరాజు,ముక్బుల్ భాష,కాకర్ల జగదీష్,పి. దుర్గారావు తదితరులు ఉన్నారు.

## ఏలూరు లో జాతీయ బాలిక దినోత్సవ సంబరాలు



**ఏలూరు జనవరి 24 పెన్ పవర్ :** స్థానిక శ్రీ సురేష్ చంద్ర బహుగుణ పోలీస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ నందు జిల్లా బాలల సంరక్షణ యూనిట్ స్త్రీ శిశు సంక్షేమ శాఖ మరియు చైల్డ్ రైట్స్ అడోకాసి ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో జాతీయ బాలిక దినోత్సవం కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జాయింట్ కలెక్టర్ డా.ఎం. జె. అభిషేక్ గౌడ మాట్లాడుతూ ముందుగా కార్యక్రమంలో పాల్గొన్న బాలికలందరికి జాతీయ బాలిక దినోత్సవం శుభాకాంక్షలు తెలియజేస్తూ బాలికలు ఎదగడానికి కావాల్సినటువంటి సోపానాలు విద్యాభివృద్ధిలో బాలికలు శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంలో మొదటి స్థానంలో ఉండాలన్నారు. నేటి సమాజంలో బాలికలకు విద్య,ఉద్యోగ అవకాశాలలో ఎక్కువ ప్రాధాన్యతను ఇస్తున్నారని,లింగ వివక్ష లేని సమాజాన్ని రూపొందించాలని, అందుకొరకు మనందరం కలిసి పని చేయాలని ప్రభుత్వం కూడా బాలబాలికలందరికి సమాన అవకాశాలు కల్పిస్తూ అనేక పథకాలను అమలు చేస్తుందన్నారు. అడిషనల్ ఎస్పీ ఎన్ సూర్య చంద్ర రావు మాట్లాడుతూ ఆనాటి కాలంలో మహిళలు ఎక్కువ శాతం కుటుంబ నేపథ్యాన్ని అభివృద్ధి పరుచుకుంటూ వచ్చేవారని, అది రాను రాను మహిళలను అణచివేతకు గురయ్యేవారన్నారు. మరల ప్రస్తుత రోజుల్లో బాలికలు ,మహిళలు అనేక రంగాలలో అభివృద్ధి చెందుతూ వారి జీవనశైలి విధానాన్ని మెరుగుపరుచుకుంటున్నారని, బాలలందరూ ఉన్నత విద్యను అభ్యసించి అనేక రంగాలలో విజయాలు సాధించాలని బాలలకు సూచించారు. మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ పి. శారద మాట్లాడుతూ బాలికలకు బాలిక దినోత్సవం శుభాకాంక్షలు తెలియజేస్తూ బాలికలందరూ నేటి సమాజంలో విద్యపై ఆసక్తిని పెంచుకుని అన్ని రంగాలలో ఉన్నత స్థాయినీ అధిరోహించేలా అన్ని విషయాలలో నాయకత్వ లక్షణాలు అలవర్చుకొని ముందుకు వెళ్లాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏలూరు జిల్లా విద్యాశాఖ అధికారి ఎమ్ . వెంకట లక్ష్మమ్మ, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ ఆర్ వి నాగరాణి జిల్లా బాలల సంరక్షణ అధికారి డాక్టర్ సిహెచ్ సూర్య చక్ర వేణి, నోడల్ ఆఫీసర్ ఈ .తులసి క్రాఫ్ స్టేట్ కోఆర్డినేటర్ సిహెచ్ ప్రభాకర్ జిల్లా కోఆర్డినేటర్ ఎస్ రవిబాబు ఆర్ వినోద్ కుమార్, తదితరులు పాల్గొన్నారు. కర్రసాము టీమ్ సౌజన్య, కరాటే దామిని సుధ టీమ్ , వివిధ రంగాల్లో ప్రతిభ కనపరచిన స్పోర్ట్స్, సోషల్ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్ హాస్టల్ లో ఉండి చదువుతూ అభివృద్ధి పథంలో ముందుకు వెళ్తున్న విద్యార్థులు కి ప్రశంస పత్రములు అందించారు. పోలీస్ స్కూల్ బాలికలు , డి సి పి యు సిబ్బంది బాలస్వామి, మాధవి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## పదవ తరగతి పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలి-డీఈఓ దిలీప్ కుమార్



**గోపాలపురం,పెన్ పవర్ జనవరి 23:**ఈ ఏడాది జరగనున్న పదవ తరగతి వార్షిక పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా ఉపాధ్యాయులు పనిచేయాలని తూర్పుగోదావరి జిల్లా విద్యాశాఖ అధికారి బి.దిలీప్ కుమార్ సూచించారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న స్కూల్ కాంప్లెక్స్ శిక్షణ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా సబ్జెక్టుల ఉపాధ్యాయులకు శిక్షణ అందిస్తున్న రిసోర్స్ పర్సన్లను ఉద్దేశించి పలు కీలక సూచనలు చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి పాఠశాలలో పదవ తరగతిలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. వంద రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా ప్రస్తుతం పరీక్షలకు ఇంకా 51 రోజుల సమయం మాత్రమే మిగిలి ఉందని గుర్తు చేశారు. విద్యార్థుల సామర్థ్యాన్ని బట్టి ప్రత్యేక తరగతులు నిర్వహించాలని,వారి విద్యా స్థాయిని తల్లిదండ్రులకు తెలియజేస్తూ విద్యార్థుల ఉత్తీర్ణతలో తల్లిదండ్రుల భాగస్వామ్యం సైతం ఉండాలన్నారు. విద్యార్థుల సామర్థ్యాన్ని పరిగణనలోకి తీసుకుని ఉత్తీర్ణత సాధించేందుకు అనుసరించాల్సిన పద్ధతులను అమలు చేయాలని తెలిపారు. ముఖ్యంగా కీ పాయింట్ల ఆధారంగా దత్తత తీసుకున్న విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కాంప్లెక్స్ చైర్మన్ పి.కనక పద్మ,మండలంలోని వివిధ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు విజయ్ కుమార్,సుబ్బలక్ష్మి కుమారి,రామ్మోహనరావు,కూరం నారాయణరావు,వివిఎస్ఎన్ మూర్తి,జొన్నకూటి ప్రభాకర్ రావు,సీఆర్పీ నాగరాజు,రిసోర్స్ పర్సన్లు అలాగే వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కోరుకొండ మండలంలో పలువురిని పరామర్శ..



**ఎమ్మెల్యే సతీమణి బత్తుల వెంకటలక్ష్మి..**

**కోరుకొండ, పెన్ పవర్, జనవరి 24:** కోరుకొండ మండలంలో గాదరాడ మధురపూడి వెస్ట్ గానుగూడెం గ్రామాలలో అనారోగ్యంతో బాధపడుతున్న వారిని ఎమ్మెల్యే సతీమణి బత్తుల వెంకటలక్ష్మి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అద్దాల శ్రీను, ఆకుల బుజ్జి, జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## నరసాపురం కనుపూరు రోడ్డుకు మరమ్మత్తులు..

**- ఎమ్మెల్యే బత్తుల ఆదేశాలు మేరకు..**



**కోరుకొండ, పెన్ పవర్, జనవరి 24:** నరసాపురం నుండి కనుపూరు వెళ్ళు మార్గంలో నరసాపురం కనకదుర్గ అమ్మవారి గుడి దగ్గర నుండి రోడ్డు పాడవడంతో ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ఆదేశాల మేరకు జనసేన పార్టీ నాయకులు తెలుగుదేశం పార్టీ నాయకులు కలిసి మరమ్మత్తులు నిర్వహించారు. ఈ సందర్భంగా శనివారం ఉదయం గతుకులుగా ఉన్న రోడ్డు కూటమి నాయకులు సదును చేసి ప్రయాణికులకు తాత్కాలిక విముక్తి కలిగించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు ప్రగడ జోగారావు, ప్రగడ దేవి ప్రసాద్, రాయపాటి సత్తిబాబు, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన మహిళలకు ఉచిత టైలరింగ్ శిక్షణ

మండల కో-ఆర్డినేటర్ల ఎంపిక



**గంగవరం ,పెన్ పవర్ ,జనవరి 24:**గిరిజన ప్రాంతాల్లో మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ఉచిత టైలరింగ్ శిక్షణ కార్యక్రమానికి సంబంధించి మండల కో-ఆర్డినేటర్ల ఎంపికను గిరికిరణం ఆగ్రో ఫారెస్ట్ కంపెనీ చైర్మన్ టి. వెంకటరమణ, డైరెక్టర్ అచ్చుత రత్నం (బేబీ) నిర్వహించారు. నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మొత్తం 7 మండలాల నుంచి ప్రతి మండలానికి నలుగురు చొప్పున కో-ఆర్డినేటర్లను ఎంపిక చేశారు. రంపచోడవరం మండలంలో 12 మంది అభ్యర్థులకు గాను 4 మందిని, రాజవొమ్మంగి మండలంలో 20 మందికి గాను 4 మందిని, అడ్డతీగల మండలంలో 12 మందికి 4 మందిని ఎంపిక చేశారు. అలాగే వై. రామవరం మండలంలో 8 మందికి 4 మంది, గంగవరం మండలంలో 22 మందికి 4 మంది, దేవిపట్నం మండలంలో 8 మందికి 4 మంది, మారేడుమిల్లి మండలంలో 10 మందికి 4 మందిని కో-ఆర్డినేటర్లుగా ఎంపిక చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గిరిజన మహిళలకు ఉచితంగా టైలరింగ్ శిక్షణ అందించి స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ సెలెక్షన్ కార్యక్రమానికి గిరిజన యువతీ యువకులు పెద్ద సంఖ్యలో హాజరై ఉత్సాహంగా పాల్గొన్నారు.

## గొర్రగోమ్మి లో బాల్య వివాహ ముక్త్ భారత్ కార్యక్రమం



**గంగవరం, పెన్ పవర్, జనవరి 24:**బాల్య వివాహాల నివారణ, బాలల హక్కులపై అవగాహన కల్పించేందుకు గంగవరం ప్రాజెక్ట్ పరిధిలో బాల్య వివాహ ముక్త్ భారత్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమం గంగవరం ప్రాజెక్ట్ సీడీపీఓ వి. సుచరిత ఆదిలక్ష్మి ఆధ్వర్యంలో గొరగొమ్మి అంగన్వాడీ కేంద్రం, ఎమ్‌పీపీ స్కూల్‌లో జరిగింది. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ బాలల హక్కులపై విస్తృతంగా వివరించారు. బాలల హక్కుల్లో ముఖ్యమైన నాలుగు రకాల హక్కులు, ముఖ్యంగా జీవించే హక్కు ప్రాధాన్యతను తెలియజేశారు. అలాగే బంధుత్వ సంబంధాలలో, ముఖ్యంగా మగవారి పట్ల బాలికలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. పిల్లల భద్రత దృష్ట్యా గుడ్ టచ్ బ్యాడ్ టచ్ అంశంపై సులభంగా అర్థమయ్యే విధంగా వివరించారు. బాల్య వివాహాలు వల్ల కలిగే నష్టాలు, బాలికల భవిష్యత్తుపై అవి చూపే ప్రభావాన్ని వివరించి, గ్రామస్థులు అందరూ కలిసి బాల్య వివాహాల నిర్మూలనకు సహకరించాలని పిలుపునిచ్చారు. పిల్లల హక్కుల పరిరక్షణలో ప్రతి ఒక్కరి పాత్ర కీలకమని వక్తలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ సూపర్వైజర్ కె. కుమారి, స్కూల్ హెచ్ఎం కె. వెంకటేశ్వర్లు దొర , టీచర్ పి. అచ్చియమ్మ , అంగన్వాడీ వర్కర్ కె.వి.వి. రాఘవమ్మ, లబ్ధిదారులు, గ్రామస్తులు పాల్గొన్నారు

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District, Andhrapradesh -533003 Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

# ఆర్.అండ్.ఆర్ ప్యాకేజీ,నగదుకోసం ఎదురుచూపులు



పోలవరం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న నిర్వాసితులు

జిల్లా కలెక్టర్‌ను ఆశ్రయించనున్నామని హెచ్చరిక

సర్వేలు జరిగి 8 సంవత్సరాలు గడిచినా పట్టించుకోని అధికారులు

**వి.ఆర్.పురం (పెన్ పవర్), జనవరి 24 :**పోలవరం ప్రాజెక్టు కారణంగా సర్వం కోల్పోయిన నిర్వా సితులు ఆర్.అండ్.ఆర్ (పునరావాసంపరిహారం) ప్యాకేజీ నగదు కోసం ఏళ్ల తరబడి ఎదురుచూస్తూ అధికార కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.41.5 కాంటూరులో ఉన్న15 గ్రామాలకు చెందిన నిర్వాసితుల పరిస్థితి దయనీయంగా మారిందని బాధితులు మీడియా ముందు ఆవేదన వ్యక్తం చేశారు.2017 సంవత్సరంలో చింతూరు ఐటీడీఏ పరిధిలోని ఈ గ్రామాల్లో ప్రభుత్వం గ్రామసభలు నిర్వహించి సర్వేలు జరిపింది.పోలవరం ప్రాజెక్టు వల్ల నిర్వాసితులైన కుటుంబాలకు ఆర్.అండ్. ఆర్.ప్యాకేజీ,గృహాల నిర్మాణం కల్పిస్తామని అప్పట్లో అధికారులు హామీ ఇచ్చారు.అయితే కొన్ని కుటుంబాల్లో యజమాని మృతి చెందడం,పేర్లులో తేడాలు,ఆధార్, బ్యాంక్,ఖాతా సమస్యలు,సాంకేతిక లోపాల కారణంగా 65 మంది నిర్వాసితులకు ఇప్పటివరకు ఆర్.అండ్.ఆర్ నగదు అందలేదు.ఈ నేపథ్యంలో 201718 సంవత్సరా ల్లో అప్పటి మండల తహసీల్దార్ శ్రీధర్,రెవెన్యూ సిబ్బంది, పోలవరం అధికారులు కలిసి మళ్లీ గ్రామసభలు నిర్వహిం చి నిర్వాసితుల పేర్లను చింతూరు ఐటీడీఏ అధికారులకు పంపించారు.ఆ పేర్లను ధవళేశ్వరం కార్యాలయంలో పనిచేస్తున్న అధికారులు (ప్రవీణ్,ఆదిత్య,అడ్మినిస్ట్రేటర్) ద్వారా తిరిగి చింతూరు ఐటీడీఏకు పంపినప్పటికీ సమ స్యకు పరిష్కారం లభించలేదని నిర్వాసితులు తెలిపారు. ధవళేశ్వరం కార్యాలయానికి వెళ్లిన బాధితులకు మీ పేర్లు చింతూరు ఐటీడీఏ,కుపంపించాము,అని చెప్పగా,చింతూ రు ఐటీడీఏ అధికారులు మాత్రం“బడ్జెట్ వస్తేనే నగదు బ్యాంక్ ఖాతాల్లో జమ అవుతుంది.అంటూ సమాధానం ఇస్తున్నారని,నిర్వాసితులు ఆరోపించారు.దీంతో నిర్వా సితులు రెండు కార్యాలయాల మధ్య తిరుగుతూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.201314 నాటి భూసేకరణ, పునరావాస చట్టం ప్రకారం ప్రతి నిర్వాసితుడికి ఆర్. అండ్.ఆర్ ప్యాకేజీ ఇవ్వాల్సి ఉన్నప్పటికీ,ఎనిమిదేళ్లు గడిచినా అధికారులు పట్టించుకోవడం లేదని,బాధితులు వాపోయారు.ఇకనైనా తగిన చర్యలు తీసుకోకపోతే అంద రం కలిసి జిల్లా కలెక్టర్‌ను ఆశ్రయిస్తామని నిర్వాసితులు మీడియాకు తెలిపారు.గిరిజన నిర్వాసితులకు తక్షణమే న్యాయం చేయాలని,పెండింగ్,లో ఉన్న ఆర్.అండ్.ఆర్ ప్యాకేజీ నగదును వెంటనే బ్యాంక్,ఖాతాల్లో జమ చేయా లని వారు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

03

ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో

కోర్టు పబ్లికేషన్ యాడ్స్

కేవలం

యాడ్ 500/-

'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'

'మరిన్ని వివరాలకు సంప్రదించండి '

93948 55244

షరతులు వర్తిస్తాయి

# గంగవరం లో జాతీయ ఓటర్ల దినోత్సవ కార్యక్రమం

**గంగవరం, పెన్ పవర్:**గంగవరం మండల తహసీల్దార్ కార్యాలయంలో నేషనల్ ఓటర్స్ డే కార్యక్రమంను తాసిల్దార్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐ లక్ష్మణరావు, అలాగే మండలంలోని బూత్ లెవల్ ఆఫీసర్స్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు ప్రాముఖ్యతను వివరించారు. ప్రతి అర్హుడైన పౌరుడు ఓటరుగా నమోదు కావాలని, తమ ఓటు హక్కును బాధ్యతాయుతంగా వినియోగించుకోవాలని సూచించారు. కొత్త ఓటర్ల నమోదు, ఓటరు జాబితా సవరణలు, ఓటరు గుర్తింపు కార్డు ప్రాముఖ్యతపై బిఎల్వోలుకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం ద్వారా ఓటర్లలో అవగాహన పెంచడం, ఎన్నికల ప్రక్రియను మరింత పారదర్శకంగా నిర్వహించడమే లక్ష్యమని అధికారులు తెలిపారు. అనంతరం గ్రామంలో ర్యాలీ మానవహారం చేపట్టారు.




# విశాఖ శ్రీ శారదా పీఠంలో ఘనంగా రెండవ రోజు వార్షిక మహోత్సవాలు

- శ్రీ రాజశ్యామల హోమంతో పరవశించిన భక్తులు
- వేద మంత్రోచ్చారణలతో మారుమోగిన పీఠ ప్రాంగణం



**పెందుర్తి, పెన్ పవర్, జనవరి 24 :** విశాఖ శ్రీ శారదా పీఠంలో నిర్వహిస్తున్న వార్షిక మహోత్సవాలు రెండవ రోజుకు ఘనంగా కొనసాగుతున్నాయి. పీఠ ప్రాంగణం భక్తుల సందడి, పూజా కార్యక్రమాల వైభవంతో ఆధ్యాత్మిక ఉత్సవ శోభను సంతరించుకుంది. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులతో పీఠం కిటకిటలాడింది. మహోత్సవాల్లో భాగంగా రెండవ రోజు ఉదయం అత్యంత పవిత్రమైన శ్రీ రాజశ్యామల హోమం శాస్త్రోక్తంగా ఘనంగా ప్రారంభమైంది. ఈ హోమాన్ని పీఠాధిష్ఠాన దేవత అయిన శ్రీ శారదా స్వరూప రాజశ్యామల అమ్మవారికి అంకితంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తర పీఠాధిపతులు శ్రీ స్వాత్మానందేంద్ర సరస్వతీ స్వామివారు స్వయంగా ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు ఆశీస్సులు అందించారు.

అమ్మవారి ఆలయంలో నిర్వహించిన అభిషేకాలు, పుష్పాలంకరణలు, దీపారాధనలు భక్తులను మంత్రముగ్ధులను చేశాయి. అనంతరం పీఠ ప్రాంగణంలోని సర్వ దేవతా మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు ఉచ్చరించిన వేద మంత్రాలు, హోమ మంత్రోచ్చారణలతో పీఠ ప్రాంగణం మారుమోగింది. వేద ఘోషలతో నిండిన ఈ దివ్య వాతావరణం భక్తుల మనస్సులను ఆధ్యాత్మికంగా పరవశింపజేసింది.

హోమాగ్నిలో ఆహుతులు సమర్పించబడుతున్న వేళ భక్తులు అమ్మవారి నామస్మరణతో తలమునకలయ్యారు. శ్రీ రాజశ్యామల హోమం ద్వారా గ్రహానుకూలత, మానసిక శాంతి, వ్యాపార అభివృద్ధి, ధనప్రాప్తి, శత్రు నాశనం, సకల కార్యసిద్ధి లభిస్తాయని పండితులు వివరించారు.

ఈ హోమంలో పాల్గొన్న భక్తులు తమ కుటుంబాల సంక్షేమం, లోక క్షేమం కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ మహోత్సవాలను దర్శించేందుకు భక్తులు సుదూర ప్రాంతాల నుంచి తరలివచ్చారు. అమ్మవారి దర్శనంతో పరమానందం పొందిన భక్తులు, పీఠంలో నిర్వహిస్తున్న యాగాలు, హోమాలు, పారాయణాలలో భక్తి శ్రద్ధలతో పాల్గొన్నారు.

రేపటి కార్యక్రమాలు 25-01-2026, ఆదివారం

ఉదయం 8.00 గంటలకు: శ్రీ దక్షిణామూర్తి స్వామివారికి విశేషాభిషేకం. ఉదయం 9.00 గంటలకు ఆదిత్య హృదయ పారాయణ, ఉదయం 9.30 గంటలకు త్రిచ సహిత అరుణ పారాయణ, విశేష సూర్యారాధన, సూర్య హోమం, దక్షిణామూర్తి హోమం, ఉదయం 10.00 గంటలకు: శ్రీ రాజశ్యామల సహిత చండీ యాగం ఈ కార్యక్రమాలన్నీ లోక క్షేమం, ధర్మ పరిరక్షణ, భక్తుల సంక్షేమం కోసమే నిర్వహిస్తున్నామని ఉత్తర పీఠాధిపతులు శ్రీ స్వాత్మానందేంద్ర సరస్వతీ స్వామివారు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో ఈ దివ్య మహోత్సవాలలో పాల్గొని అమ్మవారి అనుగ్రహం, ఆశీస్సులు పొందాలని ఆయన పిలుపునిచ్చారు.

# ఆడిట్ ప్రక్రియ అత్యంత పారదర్శకంగా ఉండాలి






ఖాతాల నిర్వహణలో నిర్లక్ష్యం సహించబోం

పెండింగ్ ఆడిట్ అభ్యంతరాలపై అధికారులకు పీయూసీ కమిటీ ఆదేశాలు

వీఎంఆర్డీఏ, జీసీసీ, ఏయూ, ఈపీడీసీఎల్ ఆర్థిక కార్యకలాపాలపై సమీక్ష

**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్ విశాఖపట్నం, జనవరి 24** వీఎంఆర్డీఏ, జీసీసీ, ఆంధ్రా యూనివర్సిటీ, ఈపీడీసీఎల్ వంటి ప్రభుత్వ రంగ సంస్థల్లో ఆడిట్ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, క్రమశిక్షణతో నిర్వహించాలని అసెంబ్లీ పబ్లిక్ అండర్?టేకింగ్స్ కమిటీ (పీయూసీ) చైర్మన్ కూన రవికుమార్ అధికారులను ఆదేశించారు. విశాఖ జిల్లాలోని వివిధ సంస్థలకు సంబంధించిన పెండింగ్ ఆడిట్ అభ్యంతరాలు, వార్షిక ఖాతాల నివేదికలపై శనివారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన అధికారుల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు.

2017--18 నుంచి 2021--22 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించిన వార్షిక ఖాతాలు,

అకౌంటెంట్ జనరల్ సూచనలు, ఆడిట్ నివేదికలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. పలు విభాగాల్లో ఆడిట్ అభ్యంతరాలు సంవత్సరాల తరబడి పెండింగ్?లో ఉండటాన్ని చైర్మన్ తీవ్రంగా తప్పుబట్టారు. ప్రతి ఆర్థిక సంవత్సరం ఖాతాలు ప్రభుత్వ నిబంధనల ప్రకారం, నిర్ణీత గడువులో పూర్తి చేయాల్సిందేనని స్పష్టం చేశారు.

జాప్యానికి బాధ్యులపై చర్యలు

ఖాతాల తయారీ, నివేదికల సమర్పణలో జాప్యం జరిగితే బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని కూన రవికుమార్ హెచ్చరించారు. బోర్డు సమావేశాల్లో ప్రతి అంశాన్ని లోతుగా చర్చించి, ఆడిట్ పారా అభ్యంతరాలపై నిరంతర సమీక్ష జరగాలని ఆదేశించారు.

వీఎంఆర్డీఏ ఒక ఆర్థిక సంస్థ తరహాలో వ్యవహరిస్తున్న నేపథ్యంలో, అక్కడి ఆర్థిక లావాదేవీలు అత్యంత క్రమశిక్షణతో, పూర్తి పారదర్శకతతో జరగాల్సిన అవసరం ఉందన్నారు. ఖాతాల నిర్వహణలో చిన్నపాటి లోపం కూడా భవిష్యత్తులో తీవ్రమైన ఆర్థిక, పరిపాలనా సమస్యలకు దారి తీస్తుందని హెచ్చరించారు.

పెండింగ్?లో ఉన్న ఆడిట్ అభ్యంతరాలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని, సంబంధిత అధికారులు పూర్తి బాధ్యతతో వ్యవహరించాలని కమిటీ ఆదేశించింది. ఇకపై అన్ని నివేదికలు స్పష్టంగా, పూర్తి వివరాలతో సమర్పించాలని సూచించింది.

కోర్టు కేసులపై ప్రత్యేక దృష్టి

వీఎంఆర్డీఏ పరిధిలో భారీ సంఖ్యలో కోర్టు కేసులు పెండింగ్?లో ఉన్న విషయంపై చైర్మన్ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం 835 కోర్టు కేసులు, 141 ఆడిట్ నివేదికలు పెండింగ్?లో ఉండటం శోచనీయమని వ్యాఖ్యానించారు. అవసరమైతే మధ్యవర్తిత్వ విధానాన్ని (మిడియేషన్) అనుసరించి కేసుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

కోర్టు కేసులు, ఆర్థిక సమస్యలు సంస్థల పురోగతిపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని, వాటి పరిష్కారానికి ప్రత్యేక మెకానిజం అభివృద్ధి చేయాలని సూచించారు.

ఇతర సంస్థలపై సమీక్ష

అనంతరం జీసీసీ, ఆంధ్రా యూనివర్సిటీ, ఈపీడీసీఎల్ సంస్థల ఆర్థిక కార్యకలాపాలు, ఖాతాల నిర్వహణపై కమిటీ సుదీర్ఘంగా సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేసింది.

ఈ సమావేశంలో కమిటీ సభ్యులు నడికూటి ఈశ్వరరావు, కుమార్ రాజా వర్ల, గౌతు శిరీష, తెనాలి శ్రావణ్ కుమార్, అసిస్టెంట్ సెక్రటరీ యు. నాగమునెయ్య, వీఎంఆర్డీఏ కమిషనర్ తేజ్ భరత్, జాయింట్ కమిషనర్ రమేష్, సెక్రటరీ మురళీకృష్ణ, సీయూపీ శిల్పా, సీఈ వినయ్ కుమార్, సీఏవో హరి ప్రసాద్, ఏయూ వీసీ జి.పి. రాజశేఖర్, రిజిస్ట్రార్ కె. రాంబాబు, ఈపీడీసీఎల్ సిఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి, డైరెక్టర్లు, ఎస్.ఈ. శ్యాంబాబు తదితర అధికారులు పాల్గొన్నారు.

# స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం విజయవంతం




**పద్మనాభం,పెన్ పవర్, జనవరి 24 :**పద్మనాభం మండలంలో స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో భాగంగా జీరో గ్యాప్ శానిటేష న్ స్వచ్ఛ ఆంధ్ర అంశాలపై ప్రజలకు అవగాహ న కల్పించేందుకు ప్రత్యేక ర్యాలీ నిర్వహించారు.ర్యాలీ సందర్భంగా పరిశుభ్రత, పారిశుధ్య ప్రా ముఖ్యత పై నినాదాలు చేస్తూ ప్రజలను చైతన్య వంతులను చేశారు. అనంతరం మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు నాంది పలికారు. అలా గే మానవహారం నిర్వహించి స్వచ్ఛతపై సమిష్టి బాధ్యతను చాటారు. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి వి. నాగేష్, మండల తహసీల్దార్ కే. ఆనందరా వు, రెవెన్యూ ఇన్స్పెక్టర్ డి. శ్యామల, ఎం శేఖ ర్ వివిధ శాఖల అధికారులు, మండల నాయ కులు మరియు సిబ్బంది ఉత్సాహంగా పాల్గొ న్నారు.

ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర లక్ష్యాలను ప్రతి గ్రా మం, ప్రతి ఇంటి వరకు తీసుకెళ్లాలని, ప్రజల భాగస్వామ్యంతోనే పరిశుభ్రమైన ఆంధ్రప్రదేశ్ సాధ్యమని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజల్లో స్వచ్ఛతపై మంచి అవగాహన ఏర్పడిం దని వారు పేర్కొన్నారు.

# చంద్రనగర్లో ఘనంగా శ్రీ సీతారాములవారి తీర్థ మహోత్సవం

స్వామివారిని దర్శించుకున్న మౌర్యసింహ, కార్పొరేటర్ దాడి వెంకట రమేష్

**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, జనవరి 24 :** స్థానిక పశ్చిమ నియోజకవర్గం, 89వ వార్డు, చంద్రనగర్ కొలివై ఉన్న శ్రీ సీతారాములవారి తీర్థ మహోత్సవం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించబడింది. ఈ మహోత్సవంలో ప్రభుత్వ విప్, పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే గణబాబు తనయుడు మౌర్యసింహ, స్థానిక వార్డు కార్పొరేటర్ దాడి వెంకట రమేష్ పాల్గొనడం ప్రత్యేక ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం ద్వారా మతపరమైన ఉత్సవాలకు ప్రభుత్వ పరంగా ఉన్న గౌరవం, ప్రోత్సాహం స్పష్టంగా కనిపించింది. స్థానిక ప్రజలతో కలిసి వారు తీర్థ మహోత్సవంలో పాల్గొనడం వల్ల నాయకులు, ప్రజల మధ్య అనుబంధం మరింత బలపడినట్లు పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

ముఖ్యంగా యువత ప్రతినిధిగా మౌర్యసింహ ఉత్సవంలో చురుకుగా పాల్గొనడం రాజకీయ వారసత్వంతో పాటు సామాజిక బాధ్యతను కూడా ప్రతిబింబించింది. అలాగే కార్పొరేటర్ దాడి వెంకట రమేష్ స్థానిక సమస్యలు, ప్రజల అవసరాలను దగ్గర నుంచి తెలుసుకునే ప్రయత్నంగా ఈ కార్యక్రమాన్ని ఉపయోగించుకున్నారని విశ్లేషణ. ఈ తరహా ఆధ్యాత్మిక కార్యక్రమాలు కేవలం మతపరమైనవే కాకుండా, సామాజిక ఐక్యతకు వేదికలుగా మారుతున్నాయని ఈ మహోత్సవం మరోసారి నిరూపించింది. ప్రజాప్రతినిధులు ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా సంప్రదాయాలు, సంస్కృతి పరిరక్షణకు తోడ్పాటు అందించడమే కాకుండా, ప్రజలతో ప్రత్యక్ష సంబంధాన్ని కొనసాగించే అవకాశాన్ని



పొందుతున్నారు. మొత్తంగా, శ్రీ సీతారాముల వారి తీర్థ మహోత్సవం భక్తి, సంప్రదాయం, రాజకీయ, సామాజిక సమన్వయానికి ప్రతీకగా నిలిచిందని చెప్పవచ్చు.

# వరల్డ్ కప్ నుంచి బంగ్లాదేశ్ ను తొలగించిన ఐసీసీ!

**2026 టీ20 ప్రపంచకప్ నుంచి బంగ్లాదేశ్ ఔట్!**

**భారత్‌లో భద్రతా కారణాలతో టోర్నీని బహిష్కరించిన బంగ్లాదేశ్**

**బంగ్లా స్థానంలో స్కాట్లాండ్‌ను ఎంపిక!**



**హైదరాబాద్ పెన్ పవర్:** అంతర్జాతీయ క్రికెట్‌లో సంచలన పరిణామం చోటుచేసుకుంది. ఫిబ్రవరిలో ప్రారంభమయ్యే టీ20 ప్రపంచకప్ 2026 నుంచి బంగ్లాదేశ్ జట్టును తొలగిస్తున్నట్లు అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) వర్గాలు తెలిపాయి. బంగ్లాదేశ్ స్థానంలో స్కాట్లాండ్‌ను టోర్నమెంట్‌లోకి తీసుకుంటున్నట్లు బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (బీసీబీ)కు ఐసీసీ లేఖ ద్వారా తెలియజేసినట్టు తెలుస్తోంది. 2007 నుంచి ప్రతి టీ20 ప్రపంచకప్‌లోనూ ఆడిన బంగ్లాదేశ్ ప్రస్థానానికి ఐసీసీ కఠిన నిర్ణయంతో తొలిసారి బ్రేక్ పడింది. భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న ఈ టోర్నమెంట్‌కు సంబంధించి భారత్‌లో తమ ఆటగాళ్ల భద్రతపై బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు తీవ్ర ఆందోళనలు వ్యక్తం చేసింది. ఈ సమస్యలను ఐసీసీ దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా సరైన పరిష్కారం లభించలేదని ఆరోపిస్తూ, టోర్నమెంట్‌ను బహిష్కరిస్తున్నట్లు బీసీబీ గురువారం ప్రకటించింది. ఈ వివాదాన్ని డిస్ప్యూట్ రిజల్యూషన్ కమిటీకి అప్పగించాలని బీసీబీ చేసిన విజ్ఞప్తిని ఐసీసీ తోసిపుచ్చింది. కమిటీకి అప్పీళ్లపై విచారణ జరిపే అధికారం లేదని, ఐసీసీ తీసుకున్న నిర్ణయమే అంతిమమని స్పష్టం చేసింది. టోర్నీలో ద పాల్గొనకపోతే స్కాట్లాండ్‌తో భర్తీ చేస్తామని ఇచ్చిన అల్టిమేటంపై బీసీబీ నుంచి స్పందన రాకపోవడంతో ఐసీసీ ఈ నిర్ణయాన్ని అమలు చేసినట్టు సమాచారం. దీనిపై ఐసీసీ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

ఈ మార్పుతో స్కాట్లాండ్ జట్టు నేరుగా గ్రూప్ సిలో ప్రవేశిస్తుంది. ఈ గ్రూప్‌లో ఇంగ్లాండ్, వెస్టిండీస్, ఇటలీ, నేపాల్ వంటి జట్లు ఉన్నాయి. స్కాట్లాండ్ తన తొలి మ్యాచ్‌ను ఫిబ్రవరి 7న కోల్‌కతాలో వెస్టిండీస్‌తో ఆడాల్సి ఉంటుంది. ఆ తర్వాత ఇటలీ, ఇంగ్లాండ్, నేపాల్‌తో మ్యాచ్ లు ఉన్నాయి. స్కాట్లాండ్ ఇప్పటివరకు ఐదు టీ20 ప్రపంచకప్‌లలో పాల్గొంది. గత రెండు టోర్నీల్లో సూపర్ 8 దశకు చేరుకోలేకపోయినా, పెద్ద జట్లకు గట్టిపోటీనిచ్చింది.

## ముున్ముందు ఏం జరుగుతుందో మాకు తెలియదు: బంగ్లాదేశ్ క్రికెటర్ షోరిఫుల్ ఇస్లాం

**టీ20 ప్రపంచ కప్‌లో బంగ్లాదేశ్ పాల్గొనడంపై అనిశ్చితి**

**మా పని ఆడటమేనని స్పష్టం చేసిన పేసర్ షోరిఫుల్ ఇస్లాం**

**భారత్‌లో భద్రతపై ఆందోళన వ్యక్తం చేస్తున్న బంగ్లా క్రికెట్ బోర్డు**

**షెడ్యూల్ మార్చేది లేదని తేల్చిచెప్పిన ఐసీసీ**

**బోర్డు నిర్ణయాన్ని గౌరవిస్తామన్న బంగ్లా క్రికెటర్లు**




**హైదరాబాద్ పెన్ పవర్:** త్వరలో జరగనున్న టీ20 ప్రపంచ కప్‌లో బంగ్లాదేశ్ పాల్గొంటుందా లేదా అనే విషయంపై ఆ దేశ ఫాస్ట్ బౌలర్ షోరిఫుల్ ఇస్లాం స్పందించాడు. ప్రపంచ కప్‌కు వెళ్లాలా వద్దా అనేది తమ చేతుల్లో లేదని, ఆటగాళ్లుగా తమ పని ప్రదర్శనపై దృష్టి పెట్టడమేనని స్పష్టం చేశాడు. భారత్‌తో దెబ్బతింటున్న సంబంధాల నేపథ్యంలో భద్రతా కారణాలను చూపుతూ, తమ జట్టును భారత్‌కు పంపేది లేదని బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (బీసీబీ) తేల్చిచెప్పింది. తమ మ్యాచ్‌లను శ్రీలంకకు మార్చాలని డిమాండ్ చేసింది. అయితే, ఈ ప్రతిపాదనను ఐసీసీ తిరస్కరించింది. షెడ్యూల్ ప్రకారమే భారత్‌లో మ్యాచ్‌లు జరుగుతాయని బుధవారం స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో బంగ్లాదేశ్ టోర్నీకి దూరమయ్యే అవకాశాలున్నాయనే ఊహాగానాలు మొదలయ్యాయి. ఈ వివాదంపై బంగ్లాదేశ్ ప్రీమియర్ లీగ్ (బీపీఎల్)లో 'ప్లేయర్ ఆఫ్ ది సీజన్' అవార్డు అందుకున్న అనంతరం షోరిఫుల్ మీడియాతో మాట్లాడాడు. "ఆటగాళ్లుగా, మేం ఎలా మెరుగ్గా రాణించాలనే దానిపైనే ఆలోచిస్తాం. ప్రపంచ కప్‌కు వెళ్లడం, వెళ్లకపోవడం అనేది మా చేతుల్లో లేదు. మా క్రికెట్ పెద్దలు తీసుకున్న నిర్ణయాన్ని మేం గౌరవిస్తాం. మా నియంత్రణలో లేని విషయం గురించి ఎక్కువగా మాట్లాడటంలో అర్థం లేదు" అని వివరించాడు.

ఈ విషయం జట్టులో చర్చకు వచ్చిందా, ఆటగాళ్లపై మానసికంగా ప్రభావం చూపుతోందా అని అడగగా.. "ముున్ముందు ఏం జరుగుతుందో మాకు తెలియదు. దాని గురించి ఆలోచించడం కంటే మా ఆటపై దృష్టి పెట్టడం మంచిది" అని షోరిఫుల్ బదులిచ్చాడు. ఇటీవలే ముగిసిన బీపీఎల్‌లో చట్టోగ్రామ్ రాయల్స్ తరఫున ఆడిన ఈ లెఫ్ట్ ఆర్మ్ పేసర్, 26 వికెట్లతో అద్భుత ప్రదర్శన కనబరిచాడు.

## మళ్లీ గ్రౌండ్‌లోకి మహీ.. నెట్స్‌లో బ్యాటింగ్..

**ఐపీఎల్ 2026 కోసం ప్రాక్టీస్ మొదలుపెట్టిన ఎంఎస్ ధోనీ**

**నెట్స్‌లో బ్యాటింగ్ చేస్తున్న వీడియోను పంచుకున్న ఝార్ఖండ్ క్రికెట్ అసోసియేషన్**

**గత సీజన్‌లో సీఎస్‌కే, ధోనీ పేలవ ప్రదర్శన**

**44 ఏళ్ల వయసులోనూ ఐపీఎల్‌లో కొనసాగుతున్న దిగ్గజ ఆటగాడు**





**హైదరాబాద్ పెన్ పవర్:** భారత మాజీ కెప్టెన్, చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) దిగ్గజ ఆటగాడు మహేంద్ర సింగ్ ధోనీ... రాబోయే ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2026 సీజన్ కోసం సన్నాహాలు ప్రారంభించాడు. ఝార్ఖండ్ స్టేట్ క్రికెట్ అసోసియేషన్ (జేఎస్‌సీఏ) తమ సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన ఒక వీడియోలో, 44 ఏళ్ల ధోనీ నెట్స్‌లో బ్యాటింగ్ ప్రాక్టీస్ చేస్తూ కనిపించాడు. ఈ వీడియోలో ధోనీ, నెట్స్‌కు సిద్ధమవుతూ జేఎస్‌సీఏ కార్యదర్శి సౌరభ్ తివారీతో మాట్లాడుతున్న దృశ్యాలు కూడా ఉన్నాయి. "చూడండి ఎవరు తిరిగొచ్చారో. జేఎస్‌సీఏ గర్వకారణం: మహేంద్ర సింగ్ ధోనీ" అంటూ జేఎస్‌సీఏ ఈ పోస్టుకు క్యాప్షన్ ఇచ్చింది. 2020లో అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన ధోనీ, కేవలం ఐపీఎల్‌లో మాత్రమే తన అభిమాన సీఎస్‌కే జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. గత ఐపీఎల్ సీజన్‌లో చెన్నై సూపర్ కింగ్స్ ప్రదర్శన నిరాశాజనకంగా ముగిసింది. ఆడిన 14 మ్యాచ్‌లలో కేవలం 4 మాత్రమే గెలిచి పాయింట్ల పట్టికలో చివరి స్థానంలో నిలిచింది. బ్యాటర్‌గా ధోనీ కూడా పెద్దగా రాణించలేకపోయాడు. 13 ఇన్నింగ్స్‌లలో 24.50 సగటుతో కేవలం 196 పరుగులు మాత్రమే చేశాడు. గాయపడిన గైక్వాడ్ స్థానంలో కొన్ని మ్యాచ్‌లకు కెప్టెన్సీ కూడా చేశాడు. ఇప్పటికీ సీఎస్‌కే జట్టులో అత్యంత కీలక ఆటగాడిగా, నాయకత్వ బృందంలో ముఖ్య సభ్యుడిగా ధోనీ కొనసాగుతున్నాడు. తన కెప్టెన్సీలో చెన్నై జట్టుకు ఐదుసార్లు ఐపీఎల్ టైటిల్ అందించాడు. ఐపీఎల్ చరిత్రలో ఇప్పటివరకు 278 మ్యాచ్‌లు ఆడిన ధోనీ, 38.80 సగటుతో 5,439 పరుగులు సాధించాడు. ఇందులో 24 అర్ధ సెంచరీలు ఉన్నాయి.

## రాజసం ఉట్టిపడేలా.. చీరకట్టులో రాశి ఖన్నా అందాలు..



**ఎంత అందం! సారా అర్జున్ తన లేటెస్ట్ ఫోటోలో చాలా అద్భుతంగా ఉంది**

టాలీవుడ్, బాలీవుడ్, కోలీవుడ్ అంటూ భాషతో సంబంధం లేకుండా వరుస భాషా చిత్రాలలో నటిస్తూ మరింత బిజీగా మారిపోయింది ప్రముఖ హీరోయిన్ రాశి ఖన్నా. 2013లో 'మద్రాస్ కేఫ్'అనే సినిమాతో హిందీ ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చిన ఈ ముద్దుగుమ్మ.. తెలుగులో 2014లో అక్కినేని కుటుంబం నటించిన 'మనం' అనే సినిమాలో కేమియో పాత్రలో కనిపించి బాగా ఆకట్టుకుంది. ఆ తర్వాత ఊహలు గుసగుసలాడే సినిమాతో హీరోయిన్ గా భారీ క్రేజీ సంపాదించుకొని జోరు, జిల్, బెంగాల్ టైగర్, సుప్రీం, జై లవకుశ, రాజా ది గ్రేట్, తొలిప్రేమ తదితర చిత్రాలలో నటించి హీరోయిన్గా భారీ పాపులారిటీ అందుకుంది.

సోషల్ మీడియాలో యాక్టివ్ గానే ఉన్న రాశి ఖన్నా బ్లాస్ట్ అయ్యే అందాలతో కుర్రాళ్లను ఉక్కిరి బిక్కిరి చేస్తోంది. అప్పుడప్పుడు గ్లామర్ ఫోటోలతో కూడా సడన్ సర్ప్రైజ్ ఇచ్చిన ఈ ముద్దుగుమ్మ.. తాజాగా చీరకట్టులో మరింత అందంగా ఆకట్టుకుంటోంది. చీరకట్టులో కూడా అందాలను దాస్తూ ఫోటోలకు ఫోజులు ఇచ్చిన ఈమె.. ఈ ఫోటోలు చూసి అభిమానులు లవ్ , ఫైర్ సింబల్ తో వైరల్ చేస్తున్నారు. ఈ అమ్మడు చీరకట్టులో ఫోటోలు తెగ వైరల్ గా మారుతున్నాయి. ఇంకొంతమంది రాజసం ఉట్టిపడేలా చీర కట్టులో ఆకట్టుకుంటోంది అంటూ కామెంట్లు చేస్తున్నారు. రాశి ఖన్నా చివరిగా 2025 లో వచ్చిన 'తెలుసు కదా' అనే సినిమాలో నటించింది. ఈ సినిమా కూడా ఫ్లాప్ గా నిలిచింది. ప్రస్తుత సినిమాల విషయానికి వస్తే.. పవన్ కళ్యాణ్ తో ఉస్తాద్ భగత్ సింగ్ సినిమాతో పాటుగా తమిళంలో ఒక సినిమా, హిందీలో మూడు చిత్రాలలో నటిస్తోంది. గతంలో చాలా బొద్దుగా ఉండే రాశి ఖన్నా ఈ మధ్యకాలంలో మరింత స్లిమ్ముగా మారి వరుస అవకాశాలను అందుకుంటోంది. తన పాత్ర నచ్చితే మాత్రం రాశి ఖన్నా సెకండ్ హీరోయిన్గా కూడా నటించడానికి సిద్ధంగానే ఉంటుంది. గతంలో కూడా ఇలా ఎన్నో చిత్రాలలో నటించి మంచి విజయాలను అందుకుంది. ప్రస్తుతం ఈమె ఫోకస్ మొత్తం ఉస్తాద్ భగత్ సింగ్ సినిమా పైనే పెట్టిందని చెప్పవచ్చు. ప్రముఖ డైరెక్టర్ హరీష్ శంకర్ దర్శకత్వంలో పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రంలో రాశి ఖన్నాతో పాటు యంగ్ బ్యూటీ శ్రీలీలా కూడా హీరోయిన్గా నటిస్తోంది. ముఖ్యంగా 13 ఏళ్ల తర్వాత మళ్లీ హరీష్ శంకర్ - పవన్ కళ్యాణ్ కాంబో రిపీట్ కాబోతుండడంతో అంచనాలు భారీగా పెరిగిపోయాయి. ఈ సినిమాతో రాశి ఖన్నా కచ్చితంగా బ్లాక్ బస్టర్ విజయం సొంతం చేసుకుంటుందని , ఈ సినిమాతో కచ్చితంగా టాలీవుడ్ లో కం బ్యాక్ అవుతుందని అభిమానులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. మరి ఈ సినిమా రాశి ఖన్నాకు ఎలాంటి అ దృష్టాన్ని తెచ్చి పెడు తుందో చూడాలి.





**రుక్మిణికి స్టైల్‌తో ఎలా మెస్మరైజ్ చేయాలో తెలుసు**

Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publishers, Flat No : 504, Bharat Towers, 5th Lane Dwarakanagar, Visakhapatnam, Andhra Pradesh - 530016, And Published At 1-17-1, Badeti Ramana Street, Near Mla House, 30th Word, Thadepalligudem , Editor Gantyada Apparao. PRGI Registration No. "APTEL/25/A2834, E-Mail : Editorpenpower@Gmail.Com, Mobile: 9059465965